# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 151 | విశాఖపట్నం | 3-3-2026 మంగళవారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 151 | VISAKHAPATNAM | 3-3-2026 TUESDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



## రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్ PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇన్‌చార్జ్: డి. లావణ్య

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9491286902


# ప్రజల్లో 90 శాతం సంతృప్తి ఉండాలి

## ఆర్టీజీఎస్, పబ్లిక్ పర్సెప్షన్‌పై సీఎం చంద్రబాబు సమీక్ష



**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్రంలో ప్రభుత్వ పాలన, వివిధ శాఖల పనితీరుపై ప్రజల్లో సానుకూల దృక్పథం (పాజిటివ్ పర్సెప్షన్) పెరిగేలా అధికారులు కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో ఆర్టీజీఎస్, పబ్లిక్ పర్సెప్షన్‌పై సోమవారం ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ నెల నుంచి ప్రభుత్వ సేవలపై ప్రజల సంతృప్తి స్థాయి కనీసం 80 నుంచి 90 శాతానికి తగ్గకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సంక్షేమ పథకాల అమలులో అలసత్వం వహించకూడదని సీఎం హెచ్చరించారు. ముఖ్యంగా పెన్షన్ల పంపిణీలో ఇంకా లోటుపాట్లు ఉన్న 'స్వర్ణ' గ్రామాలు, వార్డులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అట్టడుగు స్థానంలో ఉన్న ప్రాంతాల్లో కూడా పంపిణీ సమర్థంగా జరగాలన్నారు. అలాగే, దీపం పథకం కింద అందిస్తున్న ఉచిత గ్యాస్ సిలిండర్ల డెలివరీకి ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజారవాణాపై సమీక్షిస్తూ.. ఆర్టీసీ బస్సు సర్వీసులు బాగానే ఉన్నప్పటికీ, బస్టాండ్లలో మౌలిక వసతులు అంతంతమాత్రంగానే ఉన్నాయని సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా పుంగనూరు, వెంకటగిరి, పెనుకొండ, ప్రొద్దుటూరు, ఎమ్మిగనూరు, శ్రీకాళహస్తి బస్టాండ్లలో తాగునీరు, టాయిలెట్స్, ఫ్యాన్స్, సీటింగ్ ఏర్పాట్లపై ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని ప్రస్తావించారు. ప్రయాణికుడు బస్టాండ్‌కు వచ్చిన దగ్గరి నుంచి గమ్యస్థానం చేరేవరకూ ప్రయాణం సౌకర్యవంతంగా ఉండాలని, రాష్ట్రంలోని అన్ని బస్టాండ్లలో టాయిలెట్ల మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వరుస ప్రమాదాల నేపథ్యంలో యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు. బాణసంచా పేలుడు ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోవాలో తెలుసుకునేందుకు తమిళనాడులోని శివకాశీకి వెళ్లి అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు.



2లో

## శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానాలు రద్దు



2లో

## ప్లాన్ మార్చిన ఇరాన్... గల్ఫ్ దేశాల నగరాల్లో బాంబుల మోత



6లో

## డార్క్ చాక్లెట్ ఆరోగ్యానికి మేలు చేస్తుందా..?

# గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న తెలుగు వారి కోసం చర్యలు: మంత్రి శ్రీనివాస్




**అమరావతి, పతాకం న్యూస్:** గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న తెలుగు వారిని క్షేమంగా తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏపీ ఎన్ఆర్ఐ సాధికారిత వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. ఏపీ ఎన్నార్టీ కో ఆర్డినేటర్ల ద్వారా తాత్కాలిక వసతి ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించుకోవాలని కోరారు. సోమవారం అమరావతి వేదికగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు. ఇజ్రాయిల్ - ఇరాన్ దేశాల మధ్య యుద్ధ వాతావరణం కారణంగా, గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తతలు నెలకొన్నాయని చెప్పుకొచ్చారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఆయా దేశాల్లో చిక్కుకున్న తెలుగు వారి క్షేమం కోసం నిరంతరం తమ ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పుకొచ్చారు. వారిని తిరిగి రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు (తరువాయి 2వ పేజీలో)

### రాజధాని నిర్మాణ పనుల ఆలస్యంపై

# నారాయణ ఆగ్రహం



**అమరావతి, పతాకం న్యూస్:** రాజధాని నిర్మాణ పనులు ఆలస్యం చేస్తున్నారంటూ కాంట్రాక్టు సంస్థలపై మంత్రి నారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధాని ప్రాంతంలో పర్యటించిన అయన నేలపాడులో నిర్మిస్తున్న గెజిటెడ్ అధికారుల క్వార్టర్స్, గ్రూపు డి ఉద్యోగుల క్వార్టర్స్‌తో పాటు వివిధ నిర్మాణాలు పరిశీలించారు. పని చేయ లేకపోతే వెళ్లిపోవాలని నిర్మాణ సంస్థ ప్రతినిధులపై అసహనం వ్యక్తం చేశారు. అంతే కాకుండా షాపూర్ జీ పల్లోంజీ కన్స్ట్రక్షన్ నిర్మాణ సంస్థకు (తరువాయి 2వ పేజీలో)

### గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న ప్రవాసాంధ్రులను

# సురక్షితంగా తీసుకురావాలి: జగన్



**తాడేపల్లి, పతాకం న్యూస్:** మధ్య ప్రాచ్య దేశాల్లో నెలకొన్న యుద్ధ వాతా వరణం నేపథ్యంలో అక్కడ చిక్కుకుపోయిన ప్రవాసాంధ్రులను తక్షణమే సురక్షితంగా రాష్ట్రానికి తీసుకురావాలని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వాన్ని కోరారు. గల్ఫ్ దేశాల్లో ఏపీకి చెందిన వేలాది మంది ఉపాధి పొందుతున్నారని, ప్రస్తుతం అక్కడ నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల వల్ల వారి భద్రత ప్రశ్నార్థకంగా మారిందని తెలిపారు.

అక్కడ అనిశ్చితి నెలకొనడంతో పాటు పలు విమానాశ్రయాల్లో ఆంక్షలు, విమాన సర్వీసుల రద్దు కారణంగా చాలామంది ఎక్కడికక్కడ చిక్కుకుపోయి తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారని జగన్ పేర్కొన్నారు. ఈ క్లిష్ట సమయంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి, కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. గల్ఫ్ దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలతో సంప్రదింపులు జరిపి, ప్రత్యేక ఏర్పాట్ల ద్వారా తెలుగు వారందరినీ వెనక్కి రప్పించేందుకు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.

అలాగే, అక్కడి వారి పరిస్థితిని ఎప్పటికప్పుడు వారి కుటుంబ సభ్యులకు తెలియజేసేందుకు రాష్ట్రంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, హెల్ప్‌లైన్ నెంబర్లను అందుబాటులోకి తేవాలని సూచించారు. ప్రవాసాంధ్రుల భద్రత, వారి సురక్షిత ప్రయాణం ప్రభుత్వ బాధ్యతని, ఈ సంక్షోభ సమయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించి సత్వరమే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



## యుఏఈకి ప్రధాని మోడీ సంఘీభావం

2లో



2లో

## రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యం: రేవంత్ రెడ్డి


పతాకం న్యూస్ APTEL/25/A2082 PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా.. అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా.. పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## చావు దెబ్బ

ఢిల్లీ లిక్కర్ కేసులో మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌తో సహా 23 మంది నిందితులపై ఆరోపణలు కొట్టివేస్తూ రౌస్ అవెన్యూ ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తీర్పు దేశాన్ని కుదిపేసింది. మరీ ముఖ్యంగా త్రిశూల వ్యూహంతో ప్రతిపక్షాలపై ఇడి, సిబిఐ, ఐటి లను ఉసిగొల్పుతున్న మోడీ సర్కారుకు షాక్ తగిలింది. తెలుగు రాష్ట్రాల రాజకీయాలపై మరో విధంగా సెగ తగిలింది. ఎందుకంటే రెండు రాష్ట్రాలలో అప్పుడూ ఇప్పుడూ పాలక పార్టీలలో, కూటములలో వున్న రాజకీయ నేతల గతం, భవితవ్యం ఈ కేసుతో ఎంతగానో ముడిపడి నడిచాయి. అప్పుడూ ఇప్పుడూ అవినీతి కేసులు ఎదుర్కొంటున్న నేతలపైనా ఈ తీర్పు ఎలాంటి ప్రభావం చూపిస్తుందన్న అంచనాలు కూడా వున్నాయి. సిబిఐ ఎలాగూ ఢిల్లీ కోర్టు తీర్పుపై హైకోర్టులో అప్పీలు చేస్తానని ప్రకటించింది. 2009 నాటి 2జి కేసు ఇంకా ఒక కొలిక్కిరాని పరిస్థితిలో లిక్కర్ స్కామ్ ఇప్పటికిప్పుడు ఏదో తేలిపోతుందన్న అభిప్రాయం ఎవరికీ లేదు. అంటే ఏళ్ల తరబడి సాగే జాబితాలో మరో కేసు చేరుతుందన్నమాట. తీర్పు వచ్చాక అరవింద్ కేజ్రీవాల్ తన నిర్దోషిత్వం నిరూపితమైందని కన్నీటి పర్యంతమవడం చూశాం. ఈ తప్పుడు కేసు మోపి శాసనసభ ఎన్నికల్లో తమను దుష్ప్రచారాలతో ఓడించిన బిజెపి ఇప్పుడు మళ్లీ ఎన్నికలకు సిద్ధమా అని ఆయన సవాలు చేశారు. బిఆర్ఎస్ మాజీ నేత, కెసిఆర్ కుమార్తె కవిత కూడా న్యాయం జరిగిందని చెప్పడం ఒకటైతే మాతృ సంస్థతో కుటుంబంతో ఆమె రాజకీయ వివాదం రకరకాల రూపాల్లో వ్యక్తమవుతున్న స్థితి. 2023 చివర జరిగిన ఎన్నికల్లో తమపై వ్యతిరేక ప్రచారానికి బిజెపి ఈ కేసు కారణమైందని కేజ్రీవాల్ లాగే కెటిఆర్ కూడా అనడాన్ని కవిత తప్పు పట్టడం ఆశ్చర్యమే. ఎందుకంటే బిఆర్ఎస్ కీలక నేతల తప్పిదాలు చాలా వున్నప్పటికీ లిక్కర్ స్కామ్ ప్రభావమే లేదనడం బిజెపి వాదనకు దగ్గరగా వుంటుంది. ఇక ఎ.పి పాలక కూటమి నేతలు ఇంతవరకూ దీనిపై నోరు విప్పిన దాఖలాలు లేవు. వివిధ మీడియాలు కూడా వాటి వాటి తీరును బట్టి స్పందించడం ఊహించిందే. దేశ చరిత్రలో తొలిసారిగా ఒక ముఖ్యమంత్రిని అరెస్టు చేయడంతో నరేంద్రమోడీ ప్రభుత్వ నిరంకుశత్వం పరాకాష్టకు చేరింది. జయలలిత, లాలూ ప్రసాద్ యాదవ్, శిబు సొరేన్, మధు కోడా తదితరులు రకరకాల సందర్భాల్లో వివిధ కేసులలో జైలుకు వెళ్లిన మాట నిజమేగానీ వారు పదవులకు రాజీనామా చేసి లేదా కోల్పోయి వెళ్లారు. ఇక్కడ అధికార హోదాలోనే వెళ్లడం ఇదే తొలిసారి. లిక్కర్ స్కాం అనే దర్యాప్తులో వరుసగా అనేకమందిని అరెస్టు చేయడం ఒక ఎత్తయితే ఎన్నికల ప్రకటన జరిగాక రాజ్యాంగ పదవిలో వున్న అది కూడా దేశ రాజధాని ప్రాంతాన్ని పాలిస్తున్న కీలక నేతను వెంటబడి నిర్బంధించడం రాజ్యాంగ విలువలకే ప్రమాదమైంది. దానికి ముందు జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్‌ను కూడా అలాగే అరెస్టు చేశారు. ఇదే ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ శిసోడియా అప్పటికే జైలులోనే వున్నారు. సిబిఐ, ఇడి లను ఫెడరల్ ఏజన్సీలు (కేంద్ర సంస్థలు) అని సంబోధిస్తుంటారు. వీటికి ఆదాయపు పన్ను శాఖ ఐటిని జోడించి ప్రత్యర్థులపై ప్రయోగించడమే త్రిశూల వ్యూహంగా పేరొందింది. హిందూత్వ త్రిశూల రాజకీయాలకు తోడైంది. లిక్కర్ వ్యవహారంలో ఏం జరిగిందనేదానికీ కేజ్రీవాల్ అరెస్టుకూ ఏ సంబంధం లేదు. ఆప్ అధినేతగా ముఖ్యమంత్రిగా కేజ్రీవాల్ దీనికి బాధ్యత వహించవలసి వుంటుందని సుప్రీం కోర్టులో ఇడి అధికారులు వాదించారు. ఆప్ పార్టీని ఒక కంపెనీగా అభివర్ణించారు. మనీ లాండరింగ్ యాక్ట్ సెక్షన్ 4లో కంపెనీది బాధ్యత అన్నారు గనక ఆప్ నాయకుడుగా కేజ్రీవాల్ శిక్షార్హుడనేది వారి ఏకైక వాదన. అప్రూవర్లుగా మార్చుకున్న వారు ఇచ్చిన సాక్ష్యాలంటూ కొన్ని చూపించారు. అప్పట్లో వైసిపి ఎంపీగా వుండి తర్వాత టిడిపిలో చేరిన లిక్కర్ వ్యాపారాధినేత మాగుంట శ్రీనివాసరెడ్డి తాను కేజ్రీవాల్‌ను కలుసుకుని లెఫ్టినెంట్ గవర్నర్ సక్సేనాను కలుసుకోవడం కోసం లేఖ రాయించుకున్నానని చెప్పినదాన్నే సాక్ష్యంగా చూపారు. వాస్తవానికి ఒక ఎంపీగా ఆయన పదే పదే కలవాలని అడిగిన మీదట ఒక ట్రస్టు ఏర్పాటుపై లెఫ్టినెంట్ గవర్నర్‌ను కలవడానికి లేఖ ఇచ్చి పంపాననీ దానికి దీనికీ ఏ సంబంధం లేదని కేజ్రీవాల్ చెబుతూనే వచ్చారు. విధాన నిర్ణయాల్లో తప్పొప్పులు, వాటి వల్ల లబ్ధిదారులు ఎవరనేది ఒకటైతే ఆ సాకుతో ఏ నిర్దిష్ట ఆధారాలు లేకుండా చెప్పుడు కథనాలతో క్విడ్ ప్రోకో పేరిట ఎలా రాజ్యాంగ పదవిలో వున్నవారిని అరెస్టు చేస్తారని జడ్జి జితేంద్ర సింగ్ గడ్డిపెట్టారు. పైగా ఈ చెప్పేవారు కూడా నిందితులలో జరిగినదాంట్లో భాగస్వాములో అయినప్పుడు అసలు ఆ మాటలకు విలువెంతని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో చేసుకునే రాజకీయ ఆరోపణలను న్యాయపరమైన ఆధారాలుగా చూపిస్తే కోర్టులు ఎలా సంతృప్తి చెందుతాయని వ్యాఖ్యానించారు. కవితకు సంబంధించి కూడా అరబిందో కంపెనీ శరశ్చంద్రారెడ్డితో లావాదేవీలు, ఇచ్చి పుచ్చుకోవడాలు బ్యాంకు ఖాతాలలో అధికారికంగా జరిగినప్పుడు దర్యాప్తు చేసి తేల్చిందేమిటని కూడా అడిగారు. అన్నిటినీ మించి సౌత్‌గ్రూప్ (దక్షిణాది బృందం) ఇచ్చిన పత్రం మేరకే లిక్కర్ విధానం తయారైందని ఎలా ఎక్కడ నిరూపించలేదని కూడా ఆక్షేపించారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానాలు రద్దు



**హైదరాబాద్, పతాకం న్యూస్:** రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (శంషాబాద్) నుంచి విదేశాలకు వెళ్లాల్సిన అనేక విమానాలు రద్దయ్యాయి. ఇరాన్ – ఇజ్రాయెల్ మధ్య యుద్ధ వాతావరణం కారణంగా విమానాయన సంస్థలు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నాయి. శంషాబాద్ విమానాశ్రయం నుంచి దోహా, అబుదాబి, జెడ్డా, సౌదీ అరేబియా వెళ్లాల్సిన విమానాలు రద్దయ్యాయి. అలాగే కువైట్, దుబాయ్, మస్కట్, మదీనా వెళ్లే సర్వీసులు కూడా తాత్కాలికంగా నిలిపివేయబడ్డాయి. శంషాబాద్ నుంచి వెళ్లాల్సిన సుమారు 22 విమానాలు రద్దు కాగా, వివిధ దేశాల నుంచి రావాల్సిన మరో 22 విమానాలు కూడా రద్దయ్యాయి. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం దృష్ట్యా ఎయిర్ ఇండియా, ఇండిగో, ఎమిరేట్స్, ఖతార్ ఎయిర్‌వేస్ వంటి విమానయాన సంస్థలు విమానాలను రద్దు చేశాయి. విమానాల రద్దుతో శంషాబాద్ విమానాశ్రయం పరిసరాలు ప్రయాణికులు లేక వెలవెలబోతున్నాయి. ప్రయాణికులకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ కీలక సూచన జారీ చేసింది. మిడిల్ ఈస్ట్ దేశాలకు ప్రయాణాలను రద్దు చేసుకోవాలని... ఫ్లైట్ స్టేటస్‌ను ఎయిర్‌లైన్ వెబ్‌సైట్‌లు, ఎయిర్‌పోర్ట్ అధికారుల ద్వారా తెలుసుకోవాలని డీజీసీఏ సూచించింది.

## శ్రీకాకుళంలో ఏసీబీ దాడులు..




**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** శ్రీకాకుళం జిల్లాలో ఏసీబీ అధికారులు సోమవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. డీసీసీబీ కాలనీలోని అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ గడ్డి బాలముకుందం ఇంట్లో విస్తృత సోదాలు నిర్వహించారు. జనవరి 28వ తేదీన కంచిలి ప్రాంతంలో బాలముకుందం వార్డెన్ల నుంచి రూ. 1.84 లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆయనపై ఫిర్యాదులు రావడంతో ఏసీబీ అధికారులు చర్యలు చేపట్టారు. బీసీ హాస్టల్లో నివసిస్తున్న విద్యార్థుల నుంచి నెలవారీగా రూ.5ల చొప్పున వసూలు చేస్తున్నట్లు బాలముకుందంపై ఆరోపణలు ఉన్నాయి. ఈ ఫిర్యాదుల కారణంగా ఏసీబీ అధికారులు ఆయన నివాసాలు, కార్యాలయాల్లో విస్తృత సోదాలు నిర్వహించారు. ఏసీబీ సోదాల సమయంలో బాలముకుందం నివాసాల నుంచి సంబంధిత డాక్యుమెంట్లు, రికార్డులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

## ప్లాన్ మార్చిన ఇరాన్... గల్ఫ్ దేశాల నగరాల్లో బాంబుల మోత



**సౌదీ అరేబియా:** అబుదాబి, దోహాతో పాటు పలు ప్రధాన నగరాల్లో భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. ఇరాన్ తన పొరుగు దేశాలపై దాడులను తీవ్రతరం చేయడంతో గల్ఫ్ ప్రాంతం ఉలిక్కిపడింది. ఇప్పటివరకు సైనిక స్థావరాలపై దాడులకే పరిమితమైన ఇరాన్... ఇప్పుడు వ్యూహం మార్చింది. తాజాగా పౌర నివాసాలు, విమానాశ్రయాలు, షాపింగ్ మాల్స్ పై దాడులు చేస్తుండడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఒకవైపు ఇజ్రాయెల్, హిజ్బుల్లా మధ్య పరస్పర దాడులు కొనసాగుతుండగా, ఇరాన్ తన దాడులను ముమ్మరం చేయడం యుద్ధ మేఘాలను మరింత ముదురుస్తోంది. బహ్రెయిన్‌లో రాత్రిపూట భారీ శబ్దాలు, సైరన్ల మోతతో ప్రజలు నిద్రలేచారు. ఇక్కడ ఉన్న అమెరికా నేవీ ఫిఫ్త్ ఫ్లీట్ హెడ్ క్వార్టర్స్‌ను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ తొలుత దాడులు ప్రారంభించినట్లు కనిపించినా, ఆ తర్వాత లక్ష్యాలను మార్చుకుంది. గల్ఫ్ దేశాల సంపదకు చిహ్నాలుగా ఉన్న ఎత్తైన నివాస భవనాలు, లగ్జరీ హోటళ్లు, ఆధునిక విమానాశ్రయ టెర్మినల్స్‌పై కూడా ఇరాన్ దాడులకు తెగబడింది. ఈ దాడులను తిప్పికొట్టేందుకు ఆయా దేశాల ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ నిరంతరాయంగా పనిచేస్తున్నాయి. కువైట్‌లోని అమెరికా వైమానిక స్థావరం సమీపంలో ఒక యుద్ధ విమానం కూలిపోయినట్లు సిఎన్ఎన్ జియోలొకేట్ చేసిన వీడియో ద్వారా వెల్లడైంది. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా తమ భూభాగంపై చేసిన దాడులకు ప్రతీకారంగా ఇరాన్ ఈ దాడులను ముమ్మరం చేసింది. వాషింగ్టన్‌తో తాము ఎలాంటి చర్చలు జరపబోమని ఇరాన్ సీనియర్ అధికారి ఒకరు స్పష్టం చేశారు. మరోవైపు, కువైట్‌లో ముగ్గురు అమెరికా సైనికులు మరణించిన నేపథ్యంలో, మరింత ప్రాణనష్టం సంభవించే అవకాశాలున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంగీకరించారు. యూనైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) రక్షణ మంత్రిత్వ శాఖ కీలక ప్రకటన చేసింది. ఆదివారం ఒక్కరోజే తాము 165 బాలిస్టిక్ క్షిపణులు, రెండు క్రూయిజ్ మిసైళ్లు, 541 ఇరాన్ డ్రోన్లను అడ్డుకున్నట్లు తెలిపింది. అయినప్పటికీ, పేలుళ్ల ధాటికి ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. సౌదీ అరేబియా, ఒమన్ దేశాలపై ప్రభావం కొంత తక్కువగా ఉంది. ఒమన్‌లోని దుక్మ్ వాణిజ్య నౌకాశ్రయంపై డ్రోన్ దాడి జరగగా, సౌదీ అరేబియాలోని రియాద్, తూర్పు ప్రావిన్స్‌ల వైపు వచ్చిన దాడులను విజయవంతంగా అడ్డుకున్నట్లు అక్కడి అధికారులు తెలిపారు. 2019లో సౌదీ ఆరామ్‌కోపై జరిగిన దాడుల కంటే ప్రస్తుత దాడుల తీవ్రత, సమన్వయం చాలా ప్రమాదకర స్థాయిలో ఉండటం గల్ఫ్ ప్రాంత భవిష్యత్తుపై ఆందోళన రేకెత్తిస్తోంది.

## యుఏఈకి ప్రధాని మోడీ సంఘీభావం



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** అమెరికా, ఇజ్రాయిల్ దాడులను ప్రతిఘటిస్తూ ఇరాన్.. యుఎఇలోని అమెరికా సైనిక స్థావరాలపై దాడి చేసిన నేపథ్యంలో యుఎఇకి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సంఘీభావం తెలిపారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. యుఎఇ అధ్యక్షులు, సోదరడు షేక్ మహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో ఫోన్‌లో మాట్లాడి దాడులను ఖండించినట్లు మోడీ తెలిపారు. ఈ దాడుల్లో ప్రాణాలు కోల్పోయినవారికి సంతాపం తెలిపారు. ఈ కష్టకాలంలో యుఎఇకి భారత్ అండగా ఉంటుందని సంఘీభావం ప్రకటించారు. అలాగే అక్కడి భారత సమాజం పట్ల శ్రద్ధ వహించినందుకు యుఎఒకి మోడీ ధన్యవాదాలు తెలిపారు.

## రెండు బైకులు ఢీకొని ఒకరి మృతి

**కాకినాడ, పతాకం న్యూస్:** ఎదురెదురుగా వస్తున్న రెండు మోటార్ సైకిల్ ఢీకొనడంతో ఒక వ్యక్తి ప్రమాద స్థలంలోనే మరణించారు. ప్రత్యక్ష సాక్షులు వెల్లడించిన వివరాలు ప్రకారం స్థానిక 3వ డివిజన్ గోడారిగుంట మూడు గుళ్ల కూడలి వద్ద ఎదురు ఎదురుగా వస్తున్న ఇద్దరు బైకిస్టులు ఢీకొడం వల్ల ఈ ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో కాకినాడ జగన్నాధపురంకి చెందిన కొండమూరి రాజు వయసు( 45 )గా మృతి చెందాడు. అతివేగమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా పోలీసులు నిర్ధారించారు. సంఘటన స్థలానికి చేరుకుని పోలీసులు విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

(మొదటిపేజీ తరువాయి)

## గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న తెలుగు వారి కోసం చర్యలు: మంత్రి శ్రీనివాస్

చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఆయా దేశాల్లో ప్రస్తుతం నెలకొన్న యుద్ధ వాతావరణం కారణంగా కొన్ని విమానాశ్రయాల్లోని ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు, తాము ఎప్పటికప్పుడూ పరిస్థితులను పర్యవేక్షిస్తున్నామని అన్నారు. ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ(ఏపీఎన్నార్టీ) ద్వారా ఇబ్బందుల్లో ఉన్న ప్రవాసాంధ్రులకు అవసరమైన సహాయం చేసేందుకు గానూ చర్యలు చేపడుతున్నామని వివరించారు. గల్ఫ్ దేశాల్లోని ఏపీ ఎన్నార్టీ కోఆర్డినేటర్లను అప్రమత్తం చేసి, స్థానికంగా ఉన్న తెలుగు కుటుంబాల సహకారం తీసుకోవాలని సూచించారు. వారి ద్వారా తాత్కాలిక వసతి, భద్రత, అవసరమైన సహాయం అందించేందుకు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఏపీ ఎన్నార్టీ అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని మానిటర్ చేస్తూ, కోఆర్డినేటర్లతో సంప్రదింపులు జరుపుతున్నారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వివరించారు. స్థానికంగా ఉన్న ఇండియన్ ఎంబసీ సేవలను, అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించుకోవాలని సూచించారు. గల్ఫ్ దేశాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు తమ వివరాలను ఏపీ ఎన్నార్టీఎస్ 24/7 హెల్ప్‌లైన్ 0863 - 2340678, వాట్సాప్: +91 85000 27678 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు. వీటితోపాటు ఈమెయిల్: helpline@apnrts.comలకు, అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారు వెంటనే సంప్రదించి సహాయం పొందాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. గల్ఫ్ దేశాల్లో తెలుగు ప్రజల భద్రతపై ఏపీ ప్రభుత్వం క్లోజ్ మానిటరింగ్ చేస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు పరిస్థితులు మానిటరింగ్ చేస్తున్నామని వివరించారు. ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఏపీ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీద్వారా ప్రతి దేశంలో తెలుగు కోఆర్డినేటర్లు సిద్ధంగా ఉన్నారని చెప్పుకొచ్చారు. 24 గంటలు పనిచేసే హెల్ప్‌లైన్ వ్యవస్థ ప్రారంభించామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. టోల్ ఫ్రీ నంబర్లు: ఏపీ భవన్: 9871999430, ఏపీ ఎన్ఆర్టీ: 0863-2340678లో సంప్రదించాలని సూచించారు. బెహరిన్ ఎయిర్‌పోర్ట్‌లో ఇరుక్కున్న ఆరుగురికి వసతి కల్పించామని అన్నారు. దుబాయ్‌లో పదిమంది తెలుగు వారికి తక్షణ సహాయం అందించామని వెల్లడించారు. ఎయిర్‌పోర్ట్ అధికారులు, హోటళ్లు, ఫుడ్ సపోర్ట్ ద్వారా సేఫ్ జోన్లలో ఉంచేలా చర్యలు చేపట్టామని వివరించారు. గల్ఫ్ వెళ్లిన సుమారు లక్షమంది తెలుగువారి డేటా తమ దగ్గర ఉందని తెలిపారు. మరో ఐదు లక్షల మందికి పైగా తెలుగువారు గల్ఫ్ దేశాల్లో ఉన్నారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.

## నారాయణ ఆగ్రహం

చెందిన ఇద్దరు ప్రతినిధులను పంపించేయాలని మంత్రి నారాయణ ఆదేశించారు. సంస్థ యాజమాన్యం సీఎం చంద్రబాబుకు పనుల ఆలస్యంపై సంజాయిషీ ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. లక్ష్యాన్ని నిర్దేశించుకున్నప్పుడు అందుకు తగ్గట్టు నిర్మాణ సంస్థలు పని చేయాలని తెలిపారు. అలా పనులు చేయకుంటే ప్రభుత్వపరంగా గట్టిగా అడిగి తీరుతామని వివరించారు. వైఎస్సార్సీపీ అమరావతిపై చేసే విమర్శలు అర్ధరహితమన్న మంత్రి నారాయణ, నిరాధార ఆరోపణలను ప్రజలు నమ్మే పరిస్థితిల్లో లేరని ఎద్దేవా చేశారు. ఉద్యోగులకు నిర్మిస్తున్న 4,026 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయని వెల్లడించారు. మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టామని, గత ప్రభుత్వం మూడు ముక్కలాట ఆడకుండా ఉంటే ఈ పాటికి అన్నీ అందుబాటులోకి వచ్చేవని విమర్శించారు. గత 3 నెలలో రాజధానిలో నిర్మాణం పనులు వేగం పుంజుకున్నాయని మంత్రి నారాయణ తెలిపారు. ఆదివారం ఏపీ రాజధాని అమరావతిలో ఏపీ జ్యుడీషియల్ అకాడమీ కార్యాలయ నిర్మాణ పనులకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ చేతులమీదుగా శంకుస్థాపన జరిగింది. ప్రస్తుతం హైకోర్టుకు సమీపంలో నిర్మించనున్న ఏపీ హైకోర్టు అతిథి గృహం, క్లబ్ భవనాల నిర్మాణాలకు సైతం శంకుస్థాపన చేశారు. రాబోయే 3 ఏళ్లలో పరిపాలనకు సంబంధించిన భవనాలు అందుబాటులోకి తెస్తామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. రహదారులు పనులు 3 నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి అన్నారు. ఈసారి వర్షాకాలంలో నిర్మాణ పనులకు ఇబ్బంది లేకుండా భూగర్భ పనులను ముందుగానే పూర్తి చేస్తామని నారాయణ స్పష్టం చేశారు. "అమరావతి రాజధాని ప్రాంతంలో గెజిటెడ్ అధికారుల క్వార్టర్స్, గ్రూపు డి ఉద్యోగుల క్వార్టర్స్ కు సంబంధించి నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఉద్యోగులకు నిర్మిస్తున్న మొత్తం 4,026 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయి. మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాం. గత 3 నెలలో రాజధానిలో నిర్మాణం పనుల్లో వేగం పుంజుకుంది. రహదారులు పనులు 3 నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈసారి వర్షాకాలంలో నిర్మాణ పనులకు ఇబ్బంది లేకుండా భూగర్భ పనులను ముందుగానే పూర్తిచేస్తాం"అని మంత్రి నారాయణ తెలియజేశారు.

# రూ 60 లక్షల మంచినీటి పథకానికి మంత్రి వాసంశెట్టి భూమి పూజ



**రామచంద్రపురం, పతాకం న్యూస్:** క.గంగవరం మండలంలోని మసకపల్లి గ్రామాల్లో త్రాగునీటి సమస్య పరిష్కరించేందుకు రూ .60 లక్షలతో నిర్మించే మంచినీటి పథకానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ భూమి పూజ చేశారు. కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సీఎస్ఆర్ నిధులు రూ.60 లక్షలతో దీనిని నిర్మిస్తారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి సుభాష్ మాట్లాడుతూ, సామాజిక బాధ్యతతో కోరమండల్ ఇంటర్నేషనల్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు.సీఎస్ఆర్ కింద కాకినాడ వాకలపూడిలో అధునాతన ఆసుపత్రి ఏర్పాటు చేసి ప్రజలకు కార్పొరేట్ వైద్య సేవలు అందించడం శుభపరిణామమని తెలిపారు.. ఈ నీటి పథకం గ్రామాల అభివృద్ధికి భగీరథ ప్రాజెక్టుగా నిలుస్తుందని అన్నారు.

కోరమండల్ ప్రతినిధి పద్మనాభం మాట్లాడుతూ, మంత్రి సూచనల మేరకు నియోజకవర్గంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా స్థల దాతలు నిమ్మకాయల నాగేశ్వరరావు, నంబూరు శివప్రసాద్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు రవ్వ భూషణం, సర్పంచ్ అన్నపూర్ణ కళ్యాణ్, గడ్డం శ్రీనివాస్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అసంపూర్తి భవనాలకు మోక్షమెన్నడో?



**కొయ్యూరు, పతాకం న్యూస్:** మండలంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పలు భవన నిర్మాణాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా అగ్రికల్చర్ ప్రొడ్యూస్ యూనిట్ (రైతు భరోసా కేంద్రం) భవన నిర్మాణం దాదాపు పూర్తయి మూడేళు దాటినా ఇప్పటికీ అందుబాటులోకి రాలేదు. గత ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడం వల్లే ఈ దుస్థితి నెలకొందని తెలిసింది. గత ప్రభుత్వంలో 2019 డిసెంబరులో కొయ్యూరులో గ్రామ సచివాలయ భవనం, అగ్రికల్చర్ ప్రొడ్యూస్ యూనిట్ (రైతు భరోసా కేంద్రం), భారత్ నిర్మాణ సేవా కేంద్రం (హెల్త్ సెంటర్) నిర్మాణానికి ఉపాధి హామీ పథకం నుంచి రూ.76.75 లక్షలు మంజూరు చేసింది. ఆ పనులను చేపట్టిన కాంట్రాక్టర్లు 2020 ఫిబ్రవరిలో పనులు ప్రారంభించారు. రైతు భరోసా కేంద్రం భవన నిర్మాణం 2023లో దాదాపు పూర్తయినా కాంట్రాక్టర్‌కు గత ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో అప్పగించలేదని తెలిసింది. ఇక సచివాలయ భవన నిర్మాణం చాలా వరకు పూర్తయినా కాంట్రాక్టర్ అర్ధంతరంగా పనులు నిలిచిపోవడంతో మూడేళ్లుగా అసంపూర్తిగా దర్శనమిస్తోంది. ఇక హెల్త్ సెంటర్ భవన నిర్మాణమైతే పునాదులకే పరిమితమైంది. ప్రస్తుతం ఈ మూడు భవనాల చుట్టూ దట్టంగా తుప్పలు మొలిశాయి. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. గత ప్రభుత్వంలో లక్షలాది రూపాయల ప్రజాధనం ఇలా దుర్వినియోగమైపోయిందని పలువురు విమర్శిస్తున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి వీటి నిర్మాణాలు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

## పీఎఫ్, గ్రాడ్యుటీలను వెంటనే చెల్లించాలి



**విజయనగరం, పతాకం న్యూస్:** భీమసింగి షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల పిఎఫ్, గ్రాడ్యుటిలను వెంటనే ప్రభుత్వం చెల్లించాలని రాష్ట్ర లోక్సత్తా పార్టీ అధ్యక్షులు బి శెట్టి బాబ్జి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ దగ్గర ఉన్న జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాల వద్ద భీమసింగి కార్మికులు నిరసనను తెలపడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయనగరం జిల్లాలోని దెన్సింగ్ సహకార చెక్కర కర్ణకారాన్ని 1967, 70 ఏళ్ల ప్రారంభించారు. 16,862 మంది రైతులు మేలు దనముతో 1250 కెపాసిటీతో రైతులకు ఎంతో కీర్తి తెచ్చిన ఈ కర్మాగారం 2020 సంవత్సరంలో అవగాహన లోపంతో మూసివేశారు అప్పటినుండి నేటి వరకు 280 మంది కార్మికుల ఉద్యోగులు కుటుంబాలను రోడ్డుని పారేశారు కార్మికులు ఉద్యోగులు పిఎఫ్ గ్రాడ్యుటి నేటికీ చెల్లించ లేదన్నారు. సుమారు 9 కోట్ల రూపాయలు చెల్లింపులు చేయవలసి ఉంది. ఈ డబ్బులు అందగా కార్మికుల ఆందోళనలో అప్పులు బాధలతో తట్టుకోలేక చనిపోతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే వారి బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు .

## అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



**విజయనగరం, పతాకం న్యూస్:** అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే అదితి గజపతి రాజుకు విజయనగరంలోని తన క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందించారు. తమ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాలని కోరారు. అలాగే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీటీఎఫ్ ఉద్యోగ సంఘ నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు.

## 3న సింహాద్రి అప్పన్న పెళ్లిచూపుల వేడుక..



**సింహాచలం, పతాకం న్యూస్:** సింహగిరి శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి వార్షిక ఉత్సవాలకు తొలి అడుగు పడనుంది. ఫాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకుని ఈ నెల 3వ తేదీన స్వామివారి డోలోత్సవం వైభవంగా జరగనుంది. అయితే, అదే రోజు చంద్రగ్రహణం కారణంగా రోజంతా భక్తులకు స్వామివారి దర్శనాలు నిలిపివేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) జె.వెంకటరావు స్పష్టం చేశారు. సంప్రదాయం ప్రకారం డోలోత్సవం రోజునే స్వామివారి సోదరి, అడివివరం గ్రామ దేవత అయిన శ్రీపైడితల్లి అమ్మవారి కుమార్తెతో అప్పన్న స్వామికి పెళ్లిచూపులు జరుగుతాయని భక్తులు విశ్వసిస్తారు. స్వామివారి కల్యాణోత్సవానికి ముందు జరిగే ఈ వేడుక కోసం భక్తులు ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. ఈ ఉత్సవం కోసం తెల్లవారుజామున 4 గంటలకు స్వామివారు దేవేరుల సమేతంగా పల్లకీలో కొండ దిగువన ఉన్న పుష్కరిణి ఉద్యాన మండపానికి తరలివస్తారు. అక్కడ స్వామివారిని ఉయ్యాలలో అధిష్ఠింపజేసి డోలోత్సవం నిర్వహిస్తారు. అనంతరం చూర్ణోత్సవం, వసంతోత్సవంలో భాగంగా ఆలయ సిబ్బంది, గ్రామస్థులు రంగులు చల్లుకుని సంబరాలు చేసుకుంటారు. ఉదయం 6 గంటలకు గ్రామ తిరువీధి జరుగుతుంది. మరోవైపు, 3న మధ్యాహ్నం 3:21 నుంచి సాయంత్రం 6:49 గంటల వరకు చంద్రగ్రహణం ఉంటుందని ఈవో తెలిపారు. ఈ కారణంగా ఆ రోజు ఆలయంలో భక్తుల దర్శనాలతో పాటు అన్ని ఆర్జిత సేవలను రద్దు చేసినట్లు ప్రకటించారు. ఉత్సవానికి పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన వివరించారు.

## ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత సీట్లకు దరఖాస్తులు ఆహ్వానం



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** రానున్న విద్యా సంవత్సరంలో ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు పాఠశాల విద్యా శాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. విద్యాహక్కు చట్టం-2009 సెక్షన్ 12(1) సి ప్రకారం పేద వర్గాలకు చెందిన పిల్లలకు ప్రతి ప్రైవేటు పాఠశాలలో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు కేటాయించాలి. ఇందుకోసం ఈ నెల 20 నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ఒకటో తరగతిలో ప్రవేశాలు పొందగోరే బాలుడు/బాలిక వయస్సు సీబీఎస్ఈ సిలబస్ అయితే 2020 ఏప్రిల్ 2 నుంచి 2021 మార్చి 31వ తేదీ మధ్య జన్మించి ఐదేళ్లు నిండాలి. రాష్ట్ర సిలబస్‌లో అయితే 2020 జూన్ 2 నుంచి 2021 మే 31 తేదీ మధ్య జన్మించి ఐదేళ్లు నిండి ఉండాలి. పిల్లల కోసం దరఖాస్తు చేసే తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.1.44 లక్షలలోపు, బియ్యం కార్డు కలిగి ఉండాలి. ఆధార్ కార్డులో ఉన్న ఇంటి అడ్రస్‌ను పరిగణనలోకి తీసుకుంటారు. ఆ ప్రకారం బాలబాలికల తల్లిదండ్రులు నివసించే ఇంటికి సమీపంలో ఉన్న సచివాలయ పరిధిలో ఉన్న పాఠశాలల్లో సీటు కోసం దరఖాస్తు చేసుకోవాలి. కిలోమీటరు నుంచి ఐదు కి.మీ. పరిధిలో గల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి. మద్రిపాలెంలో నివసించే బాలబాలికల కోసం దగ్గర విశాఖ వ్యాలీ స్కూలుకు దరఖాస్తు చేసుకోవచ్చుగానీ తొలుత సదరు స్కూలుకు దగ్గరలో ఉన్న పిల్లలకు సీట్లు కేటాయించిన తరువాత మిగిలితే అవకాశం ఇస్తారు. ఇంకా సీటు కేటాయించే సమయంలో తండ్రి కులం మాత్రం ప్రామాణికంగా తీసుకుంటారు. వచ్చే నెల 17వ తేదీన సచివాలయాల్లో ఉన్న డేటా ప్రకారం దరఖాస్తుదారుల అర్హత నిర్ధారిస్తారు. అనంతరం ప్రత్యేకంగా తయారుచేసిన సాఫ్ట్‌వేర్ ద్వారా 25వ తేదీన తొలివిడత లాటరీ తీస్తారు. దీని ప్రకారం సీట్లు పొందిన బాలబాలికలు వచ్చే నెల 26 నుంచి ఏప్రిల్ ఏడో తేదీలోగా ఆయా పాఠశాలల్లో ప్రవేశాలను ధ్రువీకరించాలి. ఆ తరువాత మిగిలిన సీట్లకు ఏప్రిల్ 12న రెండో విడత లాటరీ తీస్తారు. వీరు ఏప్రిల్ 13 నుంచి 23వ తేదీలోగా ప్రవేశాలు పొందాలి. విశాఖ జిల్లాలో 650 ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో సుమారు 25 వేల సీట్లు ఉన్నాయి. వాటిల్లో నాలుగో వంతు అంటే ఆరు వేల సీట్లు వరకూ ఉచితంగా పేద వర్గాలకు చెందిన విద్యార్థులకు కేటాయించే అవకాశం ఉంది. గత ఏడాది జిల్లాలో 6,143 మందికి సీట్లు కేటాయించారు. అయితే పలు కారణాల వల్ల 2,724 మంది అర్హత కోల్పోగా, 3,419 మంది మాత్రమే ప్రవేశాలు పొందారు. అందువల్ల దరఖాస్తు చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. తాము నివసించే ప్రాంతంలోని సచివాలయానికి దగ్గరలో ఉన్న పాఠశాలలో సీటు కోసమే దరఖాస్తు చేయాలి. ఒకవేళ సదరు స్కూలు నచ్చకపోతే దరఖాస్తులో దాని ప్రస్తావన లేకుండా జాగ్రత్తపడాలని చెబుతున్నారు.

## విశాఖ షిప్‌యార్డ్‌లో హడలెత్తిస్తున్న విష సర్పాలు







**మల్కాపురం, పతాకం న్యూస్ :** విశాఖకు ఓ నౌక వచ్చి ఆగింది.. మరమ్మతుల కోసం లంగరు వేసుకుంది. అందులో పనిచేసేందుకు వర్కర్లు వెళ్లారు. ఒక్కసారిగా వాళ్లందరికీ ఒళ్ళు జలదరించే సీన్...! ఓ పాము కనిపించి క్షణాల్లో మాయమైంది. దీంతో అక్కడ ఉన్నవారు హడలెత్తిపోయారు. బయటకు పరుగులు తీసి నౌకలోని తలుపులు మూసేశారు. ఎవరూ మళ్లీ లోపలికి వెళ్లే సాహసం చేయలేదు. సముద్ర పరిశోధనల్లో ఎంతో పేరున్న 'సాగర కన్య' నౌక ఇప్పుడు పాముల భయంతో వార్తల్లో నిలిచింది. అండమాన్ సమీపంలో మరమ్మతుల కోసం నిలిపి ఉంచిన సమయంలో ఈ నౌకలోకి పాములు చేరినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం విశాఖ షిప్‌యార్డ్‌కు చేరుకున్న ఈ నౌకలో పనులు చేసేందుకు వెళ్లిన కార్మికులకు చుక్కలు కనిపిస్తున్నాయి. నెల రోజుల క్రితం మరమ్మతులు మొదలుపెట్టగా, ఒక పాము కనిపించడంతో కార్మికులు భయంతో పనులు ఆపేశారు. ఇటీవల మళ్లీ పనులు ప్రారంభించగా.. ఏకంగా ఒక భారీ కొండచిలువ, ఆ తర్వాత బుసలు కొడుతున్న నాగుపాము దర్శనమిచ్చాయి. సమాచారం అందుకున్న స్నేక్ క్యాచర్ నాగరాజు రంగంలోకి దిగి, అత్యంత చాకచక్యంగా నాగుపామును పట్టుకున్నారు. అయితే, ఇంజన్ గదిలో మరిన్ని పాములు ఉండే అవకాశం ఉందని ఆయన హెచ్చరించడంతో ఆందోళన నెలకొంది. భారతీయ సముద్ర శాస్త్ర అధ్యయనాల్లో 'సాగర కన్య' అత్యంత కీలకమైనది. హిందూ మహాసముద్రం, బంగాళాఖాతంలో వాతావరణ మరియు భౌగోళిక పరిశోధనలు చేసే ఈ నౌకలో, ఇప్పుడు పాముల బెడద కారణంగా పనులు నెమ్మదించాయి. పదే పదే పాములు బయటపడుతుండటంతో, షిప్‌యార్డ్ సిబ్బంది లోపలికి వెళ్లేందుకు సాహసించడం లేదు.

## ప్రజాస్వామ్యం పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్కూల్ పిల్లలకు పరీక్షా మెటీరియల్ పంపిణీ చేసిన శ్రీను



**దేవరాపల్లి, పతాకం న్యూస్ :** అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం, కాశీపురంలో జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షులు కొరుప్రోలు శ్రీను ఆధ్వర్యంలో టెన్త్ క్లాస్ విద్యార్థిని విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని గంగవంశం సంతోష్ సహకారంతో అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి ఇష్టపడి చదివి పరీక్షల్లో మంచి మార్కులు సంపాదిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులతో అన్నారు. ఐక్యవేదిక నాయకుడు కొరుపోలు శ్రీను మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలకు భయం వద్దు అని పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడంతోపాటు మంచి మార్గంలో ముందుకు నడవాలని ప్రతి విద్యార్థినీ విద్యార్థులుకు సూచించడం జరిగింది.అతిథిగా విచ్చేసిన కాశీపురం సర్పంచ్ ఆదిరెడ్డి వరలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షతో మంచి మార్గంలో పయనించాలని, అలాగే ఇలాంటి మంచి కార్యక్రమాలు చేస్తున్నటవంటి ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక సభ్యులను కొనియాడారు ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధాన ఉపాధ్యాయురాలు ఆర్ సుజాత ఉపాధ్యాయలు సిబ్బంది తదిరులు పాల్గొన్నారు

## కుదేలైన టమాటా రైతులు



**కృష్ణాదేవిపేట, పతాకం న్యూస్:** టమాటా ధరలు దారుణంగా పడిపోయాయి. సుమారు 30 కిలోలు బరువుండే క్రేట్ టమాటాలు కృష్ణాదేవిపేట మార్కెట్‌లో రూ.60, అనకాపల్లి మార్కెట్‌లో రూ.90 రేటు మాత్రమే పలికాయి. అయినాసరే మార్కెట్‌కు తెచ్చిన సరుకులో కొంతమేర మిగిలిపోయింది. జిల్లాలో మాడుగుల, చోడవరం, అనకాపల్లి, నర్సీపట్నం నియోజకవర్గాల పరిధిలోని పలు మండలాల్లో ఈ ఏడాది టమాటా సాగు అధిక విస్తీర్ణంలో చేపట్టారు. సాధారణంగా డిసెంబరు చివరి వారం నుంచి పంట దిగుబడి రావడం మొదలవుతుంది. కానీ గత ఏడాది మొంథా తుఫాన్ కారణంగా టమాటా సాగు నెలకుపైగా ఆలస్యమైంది. సంక్రాంతి తరువాత నుంచి కాయ దిగుబడి రావడం మొదలైంది. రెండు వారాల నుంచి అన్నిచోట్లా కాయ కోతలు మొదలవడంతో మార్కెట్లకు టమాటాల రాకపెరిగింది. దీంతో ధరలు క్రమేపీ తగ్గుముఖం పట్టాయి. 30 కిలోల క్రేట్ టమాటాలు నెల క్రితం రూ.400 పలకగా, ఇప్పుడు రూ.100 కూడా దాటడం లేదు. అనకాపల్లి కూరగాయల మార్కెట్‌కు ఆదివారం ఉదయం పలువురు రైతులు టమాటాలను తీసుకువచ్చారు. తొలుత క్రేట్ టమాటాలు రూ.100కు చిరువ్యాపారులు, హోటళ్లు, టిఫన్ సెంటర్లు నిర్వాహకులు కొనగోలు చేశారు. తొమ్మిది గంటలైనా చాలా వరకు సరుకు అమ్ముడుపోలేదు. దీంతో మరో పది రూపాయలు తగ్గించి రూ.90 చొప్పున ఇచ్చేశారు. కోత కూలి, రవాణా చార్జీలు కూడా రావని పలువురు రైతులు వాపోయారు. ఇక కృష్ణాదేవిపేట మార్కెట్‌కు కొయ్యూరు, గొలుగొండ మండలాల్లోని పలు గ్రామాల రైతులు పదుల సంఖ్యలో టమాటా క్రేట్లు తెచ్చారు. అవసరాలకు మించి టమాటాలు రావడంతో దళారులు, చిరువ్యాపారులు ధరలు తగ్గించేశారు. 30 కిలోల క్రేట్ టమాలు రూ.60 నుంచి రూ.70 వరకు అమ్మకాలు సాగాయి. గత వారంతో పోలిస్తే ధరలు 50 శాతానికిపైగా తగ్గాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలి




**విజయనగరం, పతాకం న్యూస్:** మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని డిఎస్పి ఆర్.గోవిందరావు అన్నారు. అంతర్జాతీయ మహిళా సాధికారత వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో పట్టణంలో పోలీసు అధికారులు, మహిళలు, మహిళా పోలీసులు ర్యాలీ నిర్వహించారు. కోట జంక్షన్ నుండి మూడు లాంతర్ల వరకు ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా డిఎస్పి గోవిందరావు మాట్లాడుతూమహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లోను అగ్ర స్థానం సాధించాలన్నారు. మహిళా సాధికారతకు జిల్లా పోలీసుశాఖ కట్టుబడి ఉందని, అందుకు తగిన ప్రోత్సాహాన్ని అందిస్తామన్నారు. మహిళల రక్షణకు, బాలల రక్షణకు జిల్లా పోలీసుశాఖ అత్యంత ప్రాధాన్యతను కల్పిస్తుందని, వారికి ఏ సమస్య వచ్చినా నేరుగా పోలీసు అధికారులను సంప్రదించవచ్చునని తెలిపారు. మహిళల రక్షణకు పోలీసుశాఖ చేవడుతున్న సేవలు పట్ల ప్రజలకు నిత్యం అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆపద సమయంలో పోలీసుల సహాయం, రక్షణ పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన శక్తి యాప్‌ను ప్రతి ఒక్కరూ తమ మొబైల్ ఫోన్లలో నిక్షిప్తం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విజయనగరం మహిళా పిఎస్ సిఐ ఈ.నర్సింహమూర్తి, 1వ పట్టణ సిఐ ఆర్‌విఆర్‌కె చౌదరి, 2వ పట్టణ సిఐ టి.శ్రీనివాసరావు, పలువురు ఎస్‌ఐలు, మహిళా పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థినులు, మహిళలు పాల్గొన్నారు.పోలీసుల ర్యాలీరాజాం : పట్టణంలో ఆదివారం మహిళా సాధికారిత వారోత్సవాలలో భాగంగా మహిళల భద్రతపై అవగాహన కల్పించేందుకు టౌన్ ఎస్‌ఐ ఉమా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు ర్యాలీ నిర్వహించారు. మహిళల భద్రతపై చైతన్యం పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ఎస్‌ఐ తెలిపారు. ఇటీవల కాలంలో మహిళలపై వేధింపులు, దాడులు జరుగుతున్న సందర్భంగా మహిళలు దీనిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలపై చట్టపరమైన చర్యలు, రక్షణ మార్గాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, మహిళా పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

## ఐటీడీఏ పార్కులో పర్యాటక హంగులు



**విజయనగరం, పతాకం న్యూస్:** గరుగుబిల్లి మండలంలోని తోటపల్లి ఐటిడిఎ పార్కును పర్యాటక పరంగా మరింత అభివృద్ధి చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి ఐటిడిఎ పార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన స్పీడ్ బోట్‌ను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన స్వయంగా బోటులో ప్రయాణించి భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తోటపల్లి రిజర్వాయర్ పరిసర ప్రాంతాలను పర్యాటక హబ్‌గా మార్చడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఇప్పటికే పార్కులో ఉన్న వసతులకు తోడు, యువతను, పర్యాటకులను ఆకర్షించేందుకు ఈ స్పీడ్ బోట్ రైడింగ్‌ను, గుడిసె రాట్నం ( గ్రామీణ క్రీడ )ను అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు.కలెక్టర్ చొరవతో పెరిగిన హంగులుకలెక్టర్ ప్రత్యేక ప్రోత్సాహంతో గత కొద్ది కాలంగా తోటపల్లి పార్కు రూపురేఖలు మారిపోయాయి. పర్యాటకుల కోసం ఇప్పటికే అందుబాటులోకి మరిన్ని ఆకర్షణలు వచ్చాయి, ప్రకృతి ప్రేమికుల కోసం ఆకట్టుకునేలా తీర్చిదిద్దిన పచ్చదనం, పిల్లలు ఆడుకునేందుకు వీలుగా ఏర్పాటైన ఆధునిక ఆట పరికరాలు, సాయంత్రం వేళల్లో పార్కును చూసేందుకు వీలుగా విద్యుత్ అలంకరణలు ఏర్పాటయ్యాయి. బోటింగ్ చేసే పర్యాటకుల కోసం లైఫ్ జాకెట్లు, శిక్షణ పొందిన ఆపరేటర్ల నియామకం. పర్యాటకులు ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని, పార్కు పరిశుభ్రతను కాపాడటంలో అధికారులకు సహకరించాలని కలెక్టర్ కోరారు. రానున్న రోజుల్లో మరిన్ని వినోద కార్యక్రమాలను ఇక్కడ ప్రవేశపెట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఐటిడిఎ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్‌ని ప్రధాని చేయడమే లక్ష్యం: రేవంత్ రెడ్డి



**వికారాబాద్, పతాకం న్యూస్:** తాను 19 ఏళ్లలో జెడ్పీటీసీ స్థాయి నుంచి ముఖ్యమంత్రిని అయ్యానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ, ఏపీసీసీ చీఫ్ షర్మిల తదితరులతో కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తాను రాజకీయాల్లో ఎప్పుడూ ప్రజా సమస్యలపై గళమెత్తానని అన్నారు. తన రాజకీయ జీవితంలో ఎప్పుడూ పైరవీలు చేయలేదని తెలిపారు. తన మీద అనేక కేసులు పెట్టారని, కోర్టుకు కూడా వెళ్లానని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చేయడమే తమ లక్ష్యమని అన్నారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త లక్ష్యం కూడా అదేనని అన్నారు.

దేశం కోసం రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని వ్యాఖ్యానించారు. సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారని, రాహుల్ గాంధీ అనేక సమస్యలపై పోరాటం చేశారని ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, కేసీ వేణుగోపాల్,కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు ఏసీ గదుల్లో కాదు.. ప్రజాక్షేత్రంలోకి రండి




**పశ్చిమ గోదావరి, పతాకం న్యూస్:** ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు ఏసిగదులలో పడుకుంటే దోమల బాద తెలియదని ప్రజలు దోమలు వలన పడే బాద తెలియాలంటే ప్రజా క్షేత్రం లోకి వస్తే తెలుస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి జె ఎన్ వి గోపాలన్ సూచనచేసారు ప్రజాచైతన్య పాదయాత్ర సందర్భంగా సోమవారం గణపవరం లోస్తానిక పోలిస్ ఐ లాండ్ వద్ద ప్రజలు దోమలువలనపడే బాదలు ప్రజాప్రతినిధులు కు అర్ధమయ్యే రీతిలో నడిరోడ్డుపై దోమతెరలో పడుకోని నిరసన వ్యక్తం చేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ దోమలుపై పాలకులుదండయాత్ర మాని ప్రజలపై దండయాత్ర చేస్తున్నారని మండిపడ్డారు దోమలునివ రణలో పాలకులు విఫలంచెందారని విమర్శించారు అబివృద్ది పేరుతో ప్రజలపై దాడి చేస్తున్నారు తప్పదోమలను నివారించలేకపోయారని అన్నారు గ్రామాల్లో ప్రజలకు త్రాగునీరు ఇవ్వకుండా ప్రజలపై దండయాత్ర చేస్తున్నరని అన్నారు పెట్టుబడులు కోసం విదేశాలకు ఎగిరి వెళ్ళుతున్న పాలకులు రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తెలుసుకోవడానికి సిద్దంగా లేరని అన్నారు పాదయాత్ర ముగింపు సందర్భంగా బీమవరం లో జరిగే బహిరంగ సబలో జిల్లా ప్రజాప్రతినిధులను నిలదీస్తామని సమస్యలు చర్చించకపోతే ప్రజా ప్రతినిధుల ఇళ్ళముందు ఆందోళనలు చెపడతామని అన్నారు ఈపాదయాత్రలో పాల్గొన్న ఏలూరు జిల్లా సిపిఎం కార్యదర్శి ఏరవి మాట్లాడుతూ చట్టసబలలో ప్రోలపాట్లు కంటే ఎం ఎల్ ఏ ల కు కూపన్లే ఎక్కువని అన్నారు గణపవరం మండలంలోజరుగుతున్న పాదయాత్ర కు ఆయన సంఘీబావం తెలుపుతూ మాట్లాడారు ప్రజాసమస్యలపై చర్చించాల్సిన సబను వ్యక్తి గత తగాదాలు తో లడ్డుపేరుతోకల్తీలు పేరుతో ప్రజా మనోభావాలతో ఆడుకుంటున్నారని అన్నారు పెన్షన్లు కోసం ఇళ్ళు ఇళ్ళ స్తలలా కోసం కోసం ప్రజలకు చేసిన వాగ్దానాలు అమలుచేయాలని అడుగుతుంటే వినకుండా ప్రక్కదారి పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు పషరజాసమస్యలు పట్టించుకోకుండా ఎంతో కాలం గడపలేరని ప్రజాక్షేత్రంలో ప్రజలకు సమాధానం చెప్పవలిసిన పరిస్తితి ఎదుర్కోవాలిస్సి వస్తుందని అన్నారు కార్పోరేట్ శక్తులకు 99 ,పైసలకే భూములు కట్టపెడతామని ప్రకటిస్తున్న పాలకులు పేదల ఇళ్ళస్తలాలు గురించి ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు ఉపాధి హమిని కేంద్ర ప్రభుత్వం చేసిన మార్పులను ఎందుకుప్రశ్నించలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

## అందరికీ సమాన అవకాశాలు : మంత్రి శ్రీనివాస్



**విజయనగరం, పతాకం న్యూస్:** ఒక్క బిసిలే కాదు.. అన్ని వర్గాల ఉన్నతికి కృషి చేసిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని రాష్ట్ర చిన్న మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆల్ ఎపి బిసి, ఒబిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం, ఎపిఎస్ఆర్‌టిసి బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన మెసానిక్ టెంపుల్‌లో జరిగిన సమావేశంలో మంత్రి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ బిసి సంక్షేమం, వెనుకబడిన కులాల కోసం ఆలోచన చేసిన ఏకైక వ్యక్తి జ్యోతిరావు పూలే అన్నారు. ఉద్యోగుల ఉద్యోగోన్నతులపై కార్యచరణ చేసుకుందా మన్నారు. పిఆర్‌సి, ఉద్యోగోన్నతులు విషయం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఉద్యోగులంతా ప్రభుత్వంలో భాగమేనన్నారు. ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వెంటిలేటర్‌పై ఉనన్ర రాష్ట్రాన్ని గాడిలో పెట్టి చంద్రబాబు ముందుకు నడిపిస్తున్నారని అన్నారు.రాష్ట్రం అగ్రగామిక ఎదగాలంటే మరో ఐదు 15 సంవత్సరాలు అవకాశం కల్పించాలన్నారు. రాష్ట్ర అధ్యక్షులు వీరబ్రహ్మ మాట్లాడుతూ హక్కులతో పాటు బాధ్యతలు కూడా ప్రతి ఒక్కరిలో ఉన్నాయన్నారు భవిష్యత్తులో పూలే జయంతిని ఘనంగా జరుపుకోవాలని, ఆయన జయంతి అయిన ఏప్రిల్ 11న ప్రభుత్వ ఉద్యోగులకు సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. మొట్టమొదట మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని జనవరి 3న గొప్పగా నిర్వహించుకోవాలన్నారు. ప్రతి జిల్లాల్లోనూ వీరి ఇరువులు విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇందుకోసం బిసి ఉద్యోగులంతా కృషి చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షులు బాల భాస్కరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో 53శాతంగా ఉన్న బిసిలకు ఉద్యోగ అవకాశాలు రావడం లేదని, ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆల్ బిసి ఒబిసి సంఘం నాయకులు, ఎపిఎస్ ఆర్‌టిసి బిసి సంఘం నాయకులు, ఆర్‌టిసి ప్రజా రవాణా అధికారి జి.వరలక్ష్మి, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## హోర్ముజ్ జలసంధి సంక్షోభం.. ప్రమాదంలో భారత్ ఇంధన భద్రత



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:**ఇరాక్ పై అమెరికా–ఇజ్రాయిల్ దురాక్రమణల నేపథ్యంలో హోర్ముజ్ జలసంధి ద్వారా ఇంధన సరఫరా అంతరాయం కలిగే అవకాశంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ మార్గంలో ఏ విధమైన సంక్షోభం తలెత్తినా భారతదేశ ఆర్థిక వ్యవస్థ, ఇంధన భద్రతపై తీవ్ర ప్రభావం పడే అవకాశముందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. భారతదేశం దిగుమతి చేసుకునే ముడి చమురులో 50 శాతానికి పైగా హోర్ముజ్ జలసంధి ద్వారానే వస్తుంది. ఇది ముఖ్యంగా సౌదీ అరేబియా, ఇరాక్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కువైట్ మరియు ఖతార్ నుంచి సరఫరా అవుతోంది. అదనంగా, భారతదేశ ఎల్ఎన్‌జీ దిగుమతుల్లో దాదాపు 60 శాతం, అలాగే ఎల్‌పిజి లో పెద్ద భాగం కూడా ఇదే మార్గం ద్వారా రవాణా అవుతోంది. ప్రపంచ వాణిజ్యాన్ని పర్యవేక్షించే సంస్థ 'కెప్లర్' గణాంకాల ప్రకారం, ఫిబ్రవరి 24 నాటికి రోజుకు సుమారు 2.6 మిలియన్ బ్యారెల్ల చమురు హోర్ముజ్ మార్గం ద్వారా భారతదేశానికి చేరింది. ప్రపంచ చమురు వాణిజ్యంలో సుమారు 20 శాతం, ఎల్ఎన్‌జీ వాణిజ్యంలో 30 శాతానికి పైగా ఈ జలసంధి ద్వారానే జరుగుతున్నందున, ఇక్కడి సంక్షోభం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపే ప్రమాదం ఉంది. అమెరికా దాడుల ముప్పు నేపథ్యంలో శుక్రవారం ప్రపంచ చమురు ధరలు బ్యారెల్‌కు 72.87 డాలర్లకు పెరిగాయి. ఒకే రోజులో 6 డాలర్ల పెరుగుదల నమోదైంది. బ్యారెల్‌కు రూ.10 పెరుగుదల చోటుచేసుకుంటే, భారతదేశం దిగుమతులపై సుమారు 140 బిలియన్ డాలర్లు (సుమారు రూ.1.27 లక్షల కోట్లు) అదనంగా చెల్లించాల్సి వస్తుందని అంచనా. ఇప్పటికే దేశంలో ఇంధనం, వంటగ్యాస్ ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. హోర్ముజ్ జలసంధిలో అంతరాయం ఏర్పడితే భారతదేశానికి గట్టి దెబ్బ అవుతుందని 'కెప్లర్' హెచ్చరించింది. దేశానికి అవసరమైన ముడి చమురులో దాదాపు 90 శాతం దిగుమతులపైనే ఆధారపడుతున్న నేపథ్యంలో, సరఫరా భద్రత కీలకంగా మారింది.

## హాస్టళ్లలో సమస్యల పరిష్కారానికి పోస్ట్ కార్డు ఉద్యమం : ఎస్ఎఫ్ఐ




**గుమ్మలక్ష్మీపురం, పతాకం న్యూస్:** సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ పోస్ట్ కార్డు ఉద్యమం నిర్వహిస్తోందని మన్యం జిల్లా కార్యదర్శి బి.అనిల్ అన్నారు. స్థానిక పోస్ట్ మెట్రిక్ డిగ్రీ బాలుర వసతిగృహంలో సమస్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు తమ సమస్యలపై లేఖ రాశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి అనిల్ మాట్లాడుతూ మన్యం జిల్లాలో 18 పోస్టుమెట్రిక్ వసతి గృహాలు, 34 గిరిజన సంక్షేమ హాస్టళ్లలో మౌలిక సదుపాయాల్లేవని, తక్షణమే మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకనుగుణంగా మెస్‌ఛార్జీలు పెంచాలని, అద్దె భవనాల్లో ఉంటున్న హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, హాస్టళ్లలో ఆరోగ్య కార్యకర్తలను, వాచ్ మెన్, కుక్‌లను నియమించాలని, దీనిపై సిఎం స్పందించాలని కోరారు. కార్యక్రమంలో గుమ్మలక్ష్మీపురం మండల ఎస్ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు పి.జైసింహ ఎ.గంగారావు, కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చంద్రగహణంతో 4న దేవాలయాల మూసివేత



**విజయనగరం, పతాకం న్యూస్:** చంద్రగ్రహణం కారణంగా మంగళవారం జిల్లావ్యాప్తంగా ఆలయాలను మూసివేయనున్నారు. 4న బుధవారం ఆలయాలన్నింటిలో సంప్రదాయబద్ధంగా సంప్రోక్షణ నిర్వహిస్తారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించనున్నారు. ఉత్తరాంధ్రలో చినతిరుపతిగా ప్రసిద్ధిగాంచిన తోటపల్లి వేంకటేశ్వర, కోదండరామస్వామి దేవస్థానాలను ఈ నెల 3న మూసివేయనున్నట్లు ఈవో బి.శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ.. ప్రత్యేక పూజలు చేసిన తర్వాత ఉదయం 10 గంటలకు ఉభయ దేవాలయాలను మూసివేయనున్నట్లు వెల్లడించారు. 4న గ్రహణ సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఉదయం 9 గంటల నుంచి స్వామివారి సర్వ దర్శనానికి భక్తులను అనుమతిస్తామన్నారు. ఈ విషయాన్ని జిల్లావాసులు గమనించాలని ఆయన కోరారు. పాలకొండలో కోటదుర్గమ్మ, శంబర పోలమాంబ దేవాలయాలతో పాటు జిల్లాలో ఇతర ప్రముఖ ఆలయాలను మూసివేయనున్నారు. గ్రహణం కారణంగా శంబరలో ఐదోవారం జాతర నిర్వహించడం లేదని దేవాలయ సిబ్బంది తెలిపారు.

## అంగన్‌వాడీల సంక్షేమమే లక్ష్యం: సంధ్యారాణి



**సాలూరు, పతాకం న్యూస్:** అంగన్‌వాడీల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. పోషణ అభియాన్ కార్యక్రమం కింద రాష్ట్రంలో 75 గ్రామాలు ఎంపిక కావడం ఆనందదా యకమన్నారు. సాలూరులోని తన నివాసంలో విలేఖర్లతో మాట్లాడుతూ.. ' సమస్యల పరిష్కారంపై గతంలో అంగన్‌వాడీలు సమ్మె చేసినా వైసీపీ సర్కారు పట్టించుకోలేదు.. 15 యాప్‌ల వల్ల ఇబ్బందులు పడుతున్నామని చెబితే.. కేంద్రమంత్రితో సీఎం చంద్రబాబు మాట్లాడి ఒక యాప్ వచ్చే విధంగా కృషి చేశారు. అంగన్‌వాడీలకు పనిభారం తగ్గించారు. 5జీ మొబైళ్లు ఇచ్చి.. జీతాలు పెంచిన ఘనత సీఎం చంద్రబాబుదే. మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేశాం. అంగన్ వాడీలకు మెరుగైన జీవన విధానాన్ని రూపొందించేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. కూర్చొని మాట్లాడుకుంటే సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. ధర్నాలతో ఎటువంటి ఫలితం ఉండదు. రూ.11,500 ఉన్న వేతనాన్ని ఒక్కసారిగా రూ.26వేలు పెంచమ నడం ఎంతవరకు సమంజసం. అయినప్పటికీ ఈ విషయం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిశీలనలో ఉందని తెలియజేశారు.

## ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో 100 అంతర్జాతీయ విమానాల రద్దు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభం నేపథ్యంలో విమానయాన కంపెనీలు ఆ ప్రాంతానికే కాకుండా ఇతర ప్రాంతాలకు భారీ స్థాయిలో తమ విమాన సర్వీసులను రద్దు చేశాయి. దీంతో వేలాది మంది ప్రయాణికులు విమానాశ్రయాల్లో చిక్కుకున్నారు. ఎయిర్ ఇండియా పశ్చిమాసియాలోని దేశాలకు అన్ని విమానాలను రద్దు చేసింది. ఎయిర్ ఇండియా 50 అంతర్జాతీయ విమానాలను రద్దు చేసింది. సంస్థ రద్దు చేసిన వాటిలో ముంబై-లండన్, ఢిల్లీ-బర్మింగ్‌హామ్, ఢిల్లీ-అమ్‌స్టర్‌డామ్, ఢిల్లీ-జూరిచ్, ఢిల్లీ-మిలాన్, ఢిల్లీ-వియన్నా, బెంగళూరు-లండన్(హీత్రూ), ఢిల్లీ-కోపెన్‌హాగెన్, ఢిల్లీ-లండన్ (హీత్రూ), ఢిల్లీ-ఫ్రాంక్‌ఫర్ట్, ఢిల్లీ-న్యూయార్క్, ముంబై-న్యూయార్క్, ముంబై-నెవార్క్, ఢిల్లీ-చికాగో, ఢిల్లీ-టొరంటో, ముంబై-ఫ్రాంక్‌ఫర్ట్, ఢిల్లీ-పారిస్ మధ్య రాకపోకలు సాగించే విమానాలు కూడా ఉన్నాయి. ఢిల్లీ విమానాశ్రయంలో కనీసం 100 అంతర్జాతీయ విమానాలు రద్దయ్యాయి. ఇందులో 60 వెళ్లే, 40 వచ్చే విమానాలున్నట్టు తెలుస్తోంది. ఇక చెన్నై, గల్ఫ్ దేశాల మధ్య 18 అంతర్జాతీయ విమానాలు రద్దయినట్టు చెన్నై విమానాశ్రయ వర్గాలు తెలిపాయి. దుబాయి-తిరుచిరాపల్లి సెక్టార్‌లో ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం ఆదివారం రద్దయినట్టు తిరుచిరాపల్లి ఎయిర్‌పోర్ట్ పేర్కొంది. కేరళలోని నాలుగు విమానాశ్రయాల నుంచి గల్ఫ్‌కు వెళ్లాల్సిన మెజారిటీ విమానాలు రద్దయ్యాయి. గల్ఫ్ దేశాలకు తిరువనంతపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ నుంచి వెళ్లాల్సిన 37 అంతర్జాతీయ విమానాలు శనివారం మధ్యాహ్నం నుంచి రద్దయ్యాయి. ఇందులో ఆదివారానికి సంబంధించిన 26 విమానాలున్నాయి. కన్నూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లాల్సిన ఆరు విమానాలు ఆదివారం రద్దయ్యాయి. కొచ్చిన్ విమానాశ్రయం నుంచి 35, కాలికట్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ నుంచి గల్ఫ్‌కు వెళ్లే దాదాపు 10 విమానాలు రద్దయ్యాయి. కాగా పశ్చిమాసియాలోని పలు దేశాలు తమ గగనతలాలను మూసివేయడం వల్ల ఆదివారం 444 అంతర్జాతీయ విమానాలను దేశీయ విమానయాన సంస్థలు రద్దు చేసే అవకాశం ఉందని పౌర విమానయాన శాఖ వెల్లడించింది.

## ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణాపై చర్యలు



**రాజమహేంద్రవరం, పతాకం న్యూస్:** రాజమహేంద్రవరం రూరల్ జిల్లాలో అక్రమంగా ఇసుక, కంకర, ఇతర చిన్న తరహా ఖనిజాల రవాణాపై గనుల శాఖ ప్రత్యేక దష్టి సారించిందని జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి డి.ఫణిభూషణ్ రెడ్డి తెలిపారు. శనివారం, కడియం మండలం పరిధిలోని బొమ్మూరు నుండి వేమగిరి హైవేలో పలు ప్రాంతాల్లో రూట్ చెక్ నిర్వహించినట్టు తెలిపారు. పంగిడి ప్రాంతం నుండి వస్తున్న 12 రోడ్ మెటల్ లారీలు, రంగంపేట నుండి వస్తున్న 8 గ్రావెల్ లారీలు, రాఘవాపురం నుంచి వస్తున్న ఐదు ఎర్త్ రవాణా లారీలను గుర్తించబడినట్టు తెలిపారు. సరైన పత్రాలు లేని కారణంగా మొత్తం 25 వాహనాలను స్వాధీనం చేసుకుని కడియం పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్టు తెలిపారు. మైనింగ్ బిల్లు లేకుండా చిన్న తరహా ఖనిజాలను రవాణా చేయడం ద్వారా ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించడం ఉల్లంఘనకూ పాల్పడినట్లవుతుందని తెలిపారు. సంబంధిత వాహన యజమానులు, బాధ్యులపై శాఖాపరమైన చర్యలు ప్రారంభించినట్టు పేర్కొన్నారు. అనుమతులు లేకుండా ఖనిజాలను తవ్వడం, తరలించడంపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ తనిఖీలో కార్యాలయ సిబ్బంది జి.విఘ్నేశ్వరుడు, డి.జ్యోతిర్మయి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మనీషా, టెక్నికల్ అసిస్టెంట్ ఎ.శైలజ, ఎస్.సాయికృష్ణ పాల్గొన్నారు.

## రూ.5 కోట్ల విలువైన ఎర్రచందనం పట్టివేత..



**తిరుపతి, పతాకం న్యూస్:** తిరుపతిలో ఎర్రచందనం స్మగ్లర్లపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు మరోసారి విరుచుకుపడ్డారు. సోమవారం తెల్లవారుజామున నిర్వహించిన మెరుపు దాడిలో సుమారు రూ.5 కోట్ల విలువైన 195 ఎర్రచందనం దుంగలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా 8 మంది అంతర్రాష్ట్ర ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్ట్ చేసి, 3 వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. గత కొంత కాలంగా కర్ణాటకలోని మారుమూల ప్రాంతంలో కోళ్ల ఫారం పేరుతో స్మగ్లింగ్ చేస్తున్నారు.

అటవీ ప్రాంత సరిహద్దుల్లో స్మగ్లర్లు భారీ ఎత్తున ఎర్రచందనాన్ని తరలించేందుకు సిద్ధమవుతున్నట్లు పక్కా సమాచారం అందిన వెంటనే సినీ ఫక్కీలో వారిని చుట్టుముట్టారు. పోలీసుల రాకను గమనించిన స్మగ్లర్లు.. పారిపోయే ప్రయత్నం చేసేలోపు వారిని పట్టుకున్నారు. స్మగ్లర్లను పట్టుకున్న బృందాన్ని ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు. స్మగ్లింగ్‌కు పాల్పడే వారిపై, సహకరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

# ఎన్‌వోసీ లేకపోయినా నడుస్తున్న పలు బాణసంచా కేంద్రాలు



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** నిరభ్యంతర పత్రాలు లేకుండా పలు బాణసంచా కేంద్రాలు నడుస్తున్నాయి. రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, పంచాయతీ శాఖల నిర్లక్ష్యంతో ఆయా కేంద్రాల్లో బాణసంచా తయారు చేస్తున్నారు. ఇందుకు ప్రధాన కారకులు రెవెన్యూ అధికారులని చెప్పక తప్పదు. ఎక్కడైనా బాణసంచా కేంద్రంలో ప్రమాదం సంభవిస్తే.. జిల్లాలోని ఆయా శాఖల అధికారులు ఒకటి, రెండు రోజులు హడావిడి చేసి, తరువాత మిన్నకుండిపోవడం పరిపాటిగా మారింది. శనివారం కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలోని ఒక బాణసంచా తయారీ కేంద్రంలో సంభవించిన భారీ పేలుడు ప్రమాదంలో ఇరవై మందికిపైగా చనిపోయారు. దీంతో జిల్లాలోని కొన్ని బాణసంచా తయారీ కేంద్రాల్లో ఆదివారం అధికారులు ఎప్పటి మాదిరిగానే మొక్కుబడిగా తనిఖీలు చేపట్టారు. నర్సీపట్నం, అనకాపల్లి, ఎలమంచిలి, సబ్బవరం అగ్నిమాపక కేంద్రాల పరిధిలో లైసెన్సు వున్న బాణసంచా తయారీ కేంద్రాలు 11 ఉన్నాయి. ప్రస్తుతం వీటిలో ఎనిమిది కేంద్రాలు అగ్నిమాపక శాఖ అధికారులు జారీ చేసే ఎన్‌ఓసీలు లేకుండానే నడుస్తున్నాయి. సబ్బవరం మండలంలో ఒక కేంద్రం న్యాయస్థానం నుంచి ఆదేశాలు తెచ్చుకొని నడుపుతున్నారు. కాగా బాణసంచా తయారీ కేంద్రాలను అగ్నిమాపక శాఖ అధికారులు తనిఖీ చేసి, ఆయా కేంద్రాల్లో ప్రమాదాలు జరగకుండా తగిన భద్రతా చర్యలు తీసుకోవడం లేదని, నిబంధనల ప్రకారం ఫైర్ ఎక్విప్‌మెంట్ లేదని నివేదికలు ఇచ్చినప్పటికీ.. ఆయా కేంద్రాల మూసివేతకు రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. నర్సీపట్నం అగ్నిమాపక కేంద్రం పరిధిలో 3, ఎలమంచలి పరిధిలో 2, అనకాపల్లిపరిధిలో 4, సబ్బవరం పరిధిలో 2 బాణసంచా తయారీ కేంద్రాలు ఉన్నాయి. వీటన్నింటిలో కూడా 15 కిలోల బాణసంచా తయారీ సామర్థ్యంతో మాత్రమే అనుమతులు ఉన్నాయి. కానీ వాస్తవంగా ఇందుకు పదిరెట్ల పైబడి ముడిసరకుతో బాణసంచా తయారు చేస్తున్నారు.

బాణసంచా తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలంటే తొలుత సంబంధిత ఆర్డీవోకు దరఖాస్తు చేసుకోవాలి. దీనిని పోలీసు, అగ్నిమాపక శాఖ, మండల రెవెన్యూ, సంబంధిత గ్రామ పంచాయతీ లేదా పురపాలక సంఘం అధికారులకు పంపుతారు. వీటిని తనిఖీ చేసి, నివేదిక ఇవ్వాలని ఆర్డీవో ఆదేశాలు జారీ చేస్తారు. బాణసంచా తయారీ కేంద్రా ఏర్పాటు చేసే ప్రదేశం మెయిన్ రోడ్డుకు రెండు కిలోమీటర్లు పైబడిన దూరంలో ఉండాలి. బాణసంచా తయారీకి వినియోగించే ముడిపదార్థాలు నిల్వ చేయడానికి, కార్మికులు పని చేయడానికి, ఉత్పత్తి చేసిన బాణసంచాను భద్రపరచడానికి ప్రత్యేకంగా షెడ్లు వుండాలి. బాణసంచాను ఎండబెట్టడానికి డ్రై ఏరియా తప్పనిసరిగా ఉండాలి. సంబంధిత శాఖల అధికారులు నివేదికలు ఇచ్చిన తరువాత ఆర్డీవో అనుమతులు ఇస్తారు. అంతేకాక మూడు నెలలకు ఒకసారి అగ్నిమాపక అధికారి తనిఖీ చేసి ఎన్‌ఓసీ ఇస్తారు. ఒకవేళ నిబంధనలు ప్రకారం బాణసంచా తయారీ కేంద్రం నడవడం లేదని భావిస్తే.. దీనిపై ఆర్డీవోకి నివేదిస్తారు. బాణసంచా తయారీ చేసే ఒకేచోట నలుగురుకి మించి పనిచేయకూడదు. బాణసంచా తయారీలో అనుభవం, నైపుణ్యత ఉండాలి. కానీ అత్యధిక కేంద్రాల్లో సాధారణ కూలీలతోనే బాణసంచా తయారు చేయిస్తుంటారు. ఇంకా 20 నుంచి 30 మంది దగ్గర దగ్గరగా కూర్చొని పనులు చేస్తుంటారు. పొరపాటున ప్రమాదం జరిగితే.. కార్మికులంతా బలయ్యే పరిస్థితి ఏర్పడుతున్నది.

# మార్కెట్ ధర ప్రకారం రైతులకు పరిహారం ఇవ్వాలి



**గుంటూరు, పతాకం న్యూస్:** అమరావతి ఔటర్ రింగు రోడ్డు (ఒఆర్‌ఆర్)కు భూములు కోల్పోతున్న రైతులకు మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలని ఎపి రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఒఆర్‌ఆర్ ప్రభావిత రైతుల జిల్లా సదస్సు పాత గుంటూరులోని సిఐటియు కార్యాలయంలో జరిగింది. సదస్సుకు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జె.శివశంకర్ అధ్యక్షత వహించగా కృష్ణయ్య మాట్లాడుతూ ఔటర్ రింగ్‌రోడ్డు పేరుతో ఐదు జిల్లాల్లో 121 గ్రామాలకు చెందిన రైతుల భూములను ప్రభుత్వం సేకరిస్తున్నా ఇంత వరకూ రైతులకు స్పష్టమైన విధివిధానాలు తెలపకపోవటం వల్ల భయభ్రాంతులకు గురవుతున్నరని అన్నారు. ఔటర్ రింగ్ రోడ్డుకు 70 మీటర్లు తీసుకోవాల్సి ఉండగా, 250 మీటర్ల పైనే తీసుకోవాలని నేషనల్ హైవే అథారిటీ ఇప్పటికే కొలతలతో మార్కింగ్ చేశారన్నారు. భూములు కోల్పోతున్న రైతుల పేర్లు ప్రకటించకుండా, గ్రామ సభలు నిర్వహించకుండా రైతులు వారి అభిప్రాయం తెలియజేసే అవకాశం లేకుండా చేయడం అన్యాయమన్నారు. విలువైన భూములను కారు చౌకగా తీసుకోవటానికే రైతులకు నోటీసులు ఇవ్వకుండా, ఎల్‌పి నంబర్ల పేరుతో గ్రామ సచివాలయాలో అంటించారని విమర్శించారు. రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.అజరు మాట్లాడుతూ రాజధాని పరిధిలోని ఈ భూములకు రాజధాని పద్ధతిలోనే నష్టపరిహారం చెల్లించాలన్నారు. తరతరాల నుంచి భూములు కాపాడుతూ శ్రమచేసి పెట్టుబడి పెట్టి మూడు పంటలు పండించే భూములను కారు చౌకగా ఇవ్వటానికి రైతులు సిద్ధంగా లేరన్నారు. కొన్ని గ్రామాల్లో పేదరైతులు, పేద ప్రజలు నివాసం ఉన్న ఇళ్లు కూడా కోల్పోతున్నారని తెలిపారు. వివిధ మండలాల నుంచి హాజరైన రైతులు మాట్లాడుతూ ఈ భూములే మాకు ఆధారం అని ఈ భూములు కోల్పోతే మా కుటుంబాలు భారీగా నష్టపోతాయని ఆవేదన వెలిబుచ్చారు. అభివృద్ధి పేరుతో మమ్మల్ని నష్టాలపాలు చేయడం ప్రభుత్వాలకు మంచిది కాదని, ఇదే పద్ధతి కొనసాగితే భూములు ఇవ్వటానికి సిద్ధంగా లేమని పలువురు మహిళా రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేరళలో 70 మీటర్లు మాత్రమే జాతీయ రోడ్లకి తీసుకోవటంతో పాటు, అక్కడి ప్రభుత్వం 25శాతం నిధులు కేటాయించి, రైతులకు న్యాయం జరిగేలా కృషి చేసిందని, ఇదే పద్ధతిలో మన రాష్ట్ర ప్రభుత్వం రైతులకు న్యాయం చేసే చర్యలు చేపట్టాలని సమావేశంలో తీర్మానించారు. గ్రామసభలు వెంటనే నిర్వహించి రైతుల అభిప్రాయంతో పాటు వ్యవసాయ కార్మికుల, కౌలురైతుల, గ్రామ ప్రజలు అభిప్రాయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం బాధిత రైతులతో కమిటీ ఏర్పాటు చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు ప్రభావిత రైతుల భూ పోరాట సమన్వ కమిటీ పేరుతో రానున్న కాలంలో వివిధ రూపాల్లో ఆందోళనలు చేపట్టాలని తీర్మానించారు. వెంటనే గ్రామసభలు నిర్వహించకుంటే మార్చి 9న కలెక్టర్ కార్యాలయం వద్ద దర్నా నిర్వహిస్తామన్నారు. సమావేశంలో కౌలు రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణమూర్తి, జిల్లా అధ్యక్షులు బి.రామకృష్ణ, ఉపాధ్యక్షులు పాశం రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జె.బాలరాజు, ఇ.అప్పారావు, రైతు సంఘం నాయకులు ఎం.శివ సాంబిరెడ్డి, బిక్కి శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

# ముందుకు సాగని.. పలు సర్వేలు



**విజయనగరం, పతాకం న్యూస్:** జిల్లాలో పలు సర్వేలు ముందుకు సాగడం లేదు. సకాలంలో నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నా.. పరిస్థితి మారడం లేదు. కొన్ని సచివాలయాల పరిధిలో సిబ్బంది నిర్లక్ష్యమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. వాస్తవంగా జిల్లాలోని 350 సచివాలయాల పరిధిలో అక్షర ఆంధ్ర, యూనిఫైడ్ ప్యామిలీ, సిటిజన్ ఈకేవైసీ సర్వేలు నిర్వహించాలని సచివాలయాల సిబ్బందికి ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని, ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని ఎంపీడీవోలకు, డిప్యూటీ ఎంపీడీవోలకు ఉన్నతాధి కారులు సూచించారు. అయితే క్షేత్రస్థాయిలో భిన్న పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం జిల్లాలో అక్షర ఆంధ్ర సర్వే ఒక్కటే పూర్తయింది. దీనికి సంబంధించి సచివాలయాల పరిధిలో 6,714 మంది వలంటీర్లను ఎంపిక చేయాలని, 67,111 మందిని అక్షరాస్యులుగా మార్చాలని టార్గెట్ విధించారు. అయితే లక్ష్యానికి మించి.. 6,728 మంది వలంటీర్లను ఎంపిక చేసి.. 67,708 మంది నిరక్షరాస్యుల సమాచారాన్ని సేకరించారు. యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేని గత నెల 25లోగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు ఇందుకోసం 2,960 మందిని నియమించారు. అయితే 2,732 మంది సర్వేలో పాల్గొనగా, మరో 161 మంది పాల్గొనడం లేదు. దీంతో ఈ సర్వే నత్తనడకన సాగుతుంది. జిల్లాలో 2,97,305 కుటుంబాలకు గాను ఇప్పటివరకు 2,26,985 కుటుంబాల వివరాలు సేకరించారు. ఇంకా 70 వేల కుటుంబాల వివరాలను సేకరించాల్సి ఉంది. పూర్తిస్థాయి సమాచారాన్ని ఆన్‌లైన్ పొందుపర్చాల్సి ఉంది. ఈ సర్వే ఆధారంగానే జూన్ నెలలో కుటుంబ సభ్యులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులను అందించే ప్రయత్నంలో ఉంది. గతనెల 25న ఈ సర్వేను పూర్తిచేయాల్సి ఉంది. అయితే వివిధ కారణాలతో ప్రక్రియ పూర్తికాకపోవడంతో ఈ నెలాఖరు వరకు గడువు పొడిగించినట్లు తెలిసింది. ఇక సిటిజన్ ఈకేవైసీ సర్వేలోనూ జిల్లా వెనుకంజలో ఉంది. ఆధార్ నమోదు చేసుకోలేని వారు, రేషన్ కార్డుతో ఆధార్ అనుసంధానం కాని వారు సరుకులు తీసుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో గ్రామాల్లోని రేషన్‌కార్డులకు సంబంధించి ఈ సర్వే నిర్వహిస్తున్నారు. అయితే ఈ ప్రక్రియ 50 శాతానికి మించలేదు. జిల్లాలో 86,244 మందికి గాను 42,964 మందికి సిటిజన్ ఈకేవైసీ నిర్వహించారు. మరో 37,586 మందికి ఈ ప్రక్రియ నిర్వహించాల్సి ఉంది. ఇదిలా ఉండగా జాబితిలో ఉన్న వారిలో 5,204 మంది మృతి చెందారు. పీ-4 సర్వేలోనూ సిబ్బంది వెను కంజలో ఉన్నారు. వరుస సర్వేల కారణంగా కొన్ని ప్రాంతాల్లో సచివాలయాల సిబ్బంది తమకు నచ్చిన విధంగా ఈ ప్రక్రియ చేపడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

## పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించండి

### తల్లిదండ్రులకు యుటిఎఫ్ పిలుపు



**అమరావతి, పతాకం న్యూస్:** సమాజం పట్ల బాధ్యతాయుతమైన పౌరులను తయారు చేసే ప్రభుత్వ బడిలో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని ఫెడరేషన్ కార్యవర్గ సమావేశంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ విజయవాడలోని రాష్ట్ర కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మంచీచెడుల జ్ఞానం, జయపజయాలను ఒకేలా చూసే దృఢ సంకల్పం అలవర్చేది ప్రభుత్వ బడి అని తెలిపారు. గాంధీ, నెహ్రూ, అంబేద్కర్, అబ్దుల్ కలాం వంటి ప్రపంచం గర్వించదగ్గ మేధావులందరూ ప్రభుత్వ బడిలోనే చదివారనే విషయాన్ని గమనించాలని కోరారు. ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు కూడా ప్రభుత్వ బడి ద్వారానే అభివృద్ధి చెందారని తెలిపారు. నైతిక, రాజ్యాంగ విలువలు అలవర్చేది ప్రభుత్వ బడి ద్వారానే సాధ్యపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ బడి ప్రజలందరి సంపద అని, దీనిని రక్షించుకోవాల్సిన పని సమాజం తీసుకోవాలని కోరారు. ఈనాడు ప్రభుత్వ బడి సర్వాంగ సుందరంగా తీర్చదిద్దబడిందని, పిల్లలకు అన్ని రకాల సౌకర్యాలు ఉచితంగా అందించబడుతుందని తెలిపారు. వ్యాయామం, లైబ్రరీ, ప్రయోగశాలలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతినెలా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తూ పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని వివరించారు. బడి ఈడు పిల్లలందరినీ గుర్తించి ప్రభుత్వ బడిలో చేర్పించడానికి ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చేయాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులకు ప్రభుత్వ బడిలో ఉన్న సౌకర్యాలు వివరించి నమ్మకాన్ని కలిగించే బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలని కోరారు. మీ బిడ్డలను తమ బిడ్డలుగా భావించే సామర్థ్యం కలిగిన మంచి ఉపాధ్యాయులు ప్రభుత్వ బడిలో ఉన్నారని, అవసరమైతే అదనంగా ఒక గంట పాఠశాలలో పనిచేయడానికి సిద్ధపడ్డ ఉపాధ్యాయులు ఉన్నారనే విషయాన్ని ప్రత్యేకంగా వివరించాలని కోరారు. యుటిఎఫ్ చేస్తున్న 'ప్రభుత్వ బడి అభివృద్ధి' కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాలు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు కె శ్రీనివాసరావు, సహాధ్యక్షులు కె సురేష్‌కుమార్, ఎఎన్ కుసుమకుమారి, కోశాధికారి రెడ్డి మోహనరావు, కార్యదర్శులు లక్ష్మీరాజా, ఎస్‌పి మనోహర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మే 9,10 తేదీల్లో ఆవాజ్ రాష్ట్ర మహాసభ



**నెల్లూరు, పతాకం న్యూస్:** ఆవాజ్ 3వ రాష్ట్ర మహాసభ మే నెల 9,10 తేదీల్లో రెండు రోజుల పాటు నెల్లూరులో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ పేర్కొన్నారు. నగరంలోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జరిగిన సంఘం సర్వసభ్య సమావేశానికి ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథులుగా ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు ఎస్.ఎ.సుభహాన్, ఎంఎ చిష్టి మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశంలో మతసామరస్యం, లౌకికత్వం ప్రజలకు ఎంతో అవసరం అన్నారు. తినే తిండి మీద కట్టుకునే బట్ట మీద నిరంతరం దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కోవా బన్ వ్యాపారిపైన దాడే నిదర్శనమన్నారు. మత సామరస్యానికి ఆవాజ్ కృషి చేస్తోందన్నారు. ఈ మహాసభ ప్రతి ఒక్కరిని కదిలించి మతసామరస్యాన్ని కాపాడేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ అజీజ్ అహ్మద్, ఆవాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.చాంద్ భాష, రాష్ట్ర సహాయ కార్యదర్శి పి. యజాన్, ఆవాజ్ జిల్లా అధ్యక్షులు సయ్యద్ రఫీ అహ్మద్, ఇతర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులుగా డాక్టర్ షేక్ రఫీక్, అధ్యక్షులుగా విఠపు బాలసుబ్రమణ్యం (మాజీ ఎంఎల్‌సి), ప్రధాన సలహాదారులుగా డాక్టర్ షేక్ ఖాజా రసూల్ (రిటైర్డ్ లెక్చరర్), ప్రధాన కార్యదర్శిగా షేక్ రషీద్ (ఆవాజ్ జిల్లా కార్యదర్శి), కార్యనిర్వాహక అధ్యక్షులుగా పి.యజ్ఞాని భాష, సయ్యద్ రఫీ అహ్మద్, కోశాధికారిగా మహమ్మద్ సర్దార్ అహ్మద్‌తో పాటు మరో 64 మందితో కలిసి 71 మందితో కమిటీని ఎన్నుకున్నారు.

## రైలు ఢీకొని ఒకరు మృతి

**తెనాలి, పతాకం న్యూస్:**తెనాలి రైల్వే స్టేషన్ సమీపంలో మద్రాసు రైల్వే గేటు వద్ద రైలు ఢీకొని ఒకరు మృతి చెందారు. ఈ ప్రమాదంలో పినపాడు ప్రాంతానికి చెందిన కరేటి సురేష్ (53) అక్కడికక్కడే మృతి చెందారు. బజారు ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్ళే క్రమంలో రైలు ఢీకొట్టినట్లు స్థానికులు చెప్పారు. మృతుడికి భార్యా, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న తెనాలి జి.ఆర్.పి, ఆర్.పి.ఎఫ్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఘటనపై విచారణ చేపడతామని, మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించినట్లు తెనాలి జిఆర్పి ఇంచార్జీ ఎస్సై యల్ సరస్వతి తెలిపారు. మృతుడు వ్యవసాయం ఆధారంగా కుటుంబాన్ని పోషిస్తాడని ఆయన మరణంతో దిక్కుతోచని పరిస్థితి నెలకొందని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

## 5న ఆశావర్కర్ల 'చలో విజయవాడ'



**అమరావతి, పతాకం న్యూస్:** ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 5న చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. విజయవాడ ఎంబివికెలో ఇందుకు సంబంధించిన పోస్టరును సిఐటియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నరసింగరావు, యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ధనలక్ష్మి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిహెచ్ నరసింగరావు మాట్లాడుతూ.. మాతా, శిశు సంరక్షణ పేరుతో నియమింపబడిన ఆశా వర్కర్లతో ప్రభుత్వం అన్ని పనులూ చేయించుకుంటుందన్నారు. సర్వేల పేరుతో పని భారాన్ని పెంచుతున్నారని, తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారని, ఆశా వర్కర్లకు సంబంధం లేని పనుల సైతం బలవంతంగా బెదిరించి చేయిస్తున్నారని తెలిపారు. కె ధనలక్ష్మి మాట్లాడుతూ.. పిహెచ్‌సి, యుపిహెచ్‌సి, వెల్నెస్ సెంటర్స్‌ను క్లీనింగ్ చేయించడం, బాత్రూములు కడిగించడం, బూజులు దులిపించడం వంటి అవమానకరమైన పనులు కూడా చేయిస్తున్నారని, కోవిడ్ కాలంలో ప్రాణాలకు తెగించి పనిచేసిన ఆశాలను ప్రపంచ ఆరోగ్య సంస్థ గ్లోబల్ హెల్త్ ఆర్గనైజర్‌గా గుర్తింపునిస్తే దేశంలో ఆశా వర్కర్ల సేవలను గుర్తించలేని, గౌరవించలేని గుడ్డి ప్రభుత్వంగా మోడీ ప్రభుత్వం ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతోన్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు పి ధనశ్రీ, సిహెచ్ పద్మ, కల్పన, శ్రీలక్ష్మి, ఎం మణి, శివకుమారి తదితరులు పాల్గొన్నారు. వేతనాలు పెంచాలని నిరసన దీక్షలు చేసిన ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో చలో విజయవాడ ఆందోళన కార్యక్రమంకు బయలుదేరామని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు వరలక్ష్మి తెలిపారు. సోమవారం విజయవాడలోనే ధర్నా చౌకలో జరిగే ఆందోళనలో ఆదోని నుండి ప్రాతినిధ్యం వహిస్తున్నామన్నారు. అంగన్వాడీలకు 26,000 హెల్పర్లకు 20000 వేతనం ఇవ్వాలని ప్రభుత్వంను కోరిన పట్టించుకోవడంలేదన్నారు. బడ్జెట్లో నిధులు పెంచి ఐసిడిఎస్ ను బలోపేతానికి ప్రభుత్వాలు కృషి చేయాలని డిమాండ్ చేశారు. చాలీచాలని వేతనాలతో కుటుంబాలు నెట్టక, పిల్లలను మెరుగైన విద్యకు ఫీజులు చెల్లించక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నామన్నారు. ప్రభుత్వం స్పందించి వేతనాలు పెంచాలని లేని యెడల ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# డార్క్ చాక్లెట్ ఆరోగ్యానికి మేలు చేస్తుందా..?



డార్క్ చాక్లెట్ నిజంగానే ఆరోగ్యానికి మేలు చేస్తుందా..? అధ్యయనాలు ఏం చెబుతున్నాయి..? డార్క్ చాక్లెట్ చాలా రుచిగా ఉంటుంది. దీనిని తినడానికి చాలా మంది ఇష్టపడతారు. రుచిని మాత్రమే కాకుండా డార్క్ చాక్లెట్ అనేక ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుంది. అయితే గుండెను, కాలేయాన్ని రక్షించడంలో కూడా డార్క్ చాక్లెట్ ముఖ్య పాత్ర పోషిస్తుందని మీకు తెలుసా. డార్క్ చాక్లెట్‌లో యాంటీ ఆక్సిడెంట్ సమ్మేళనాలు సమృద్ధిగా ఉంటాయి. డార్క్ చాక్లెట్ చాలా రుచిగా ఉంటుంది. దీనిని తినడానికి చాలా మంది ఇష్టపడతారు. రుచిని మాత్రమే కాకుండా డార్క్ చాక్లెట్ అనేక ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుంది. అయితే గుండెను, కాలేయాన్ని రక్షించడంలో కూడా డార్క్ చాక్లెట్ ముఖ్య పాత్ర పోషిస్తుందని మీకు తెలుసా. డార్క్ చాక్లెట్‌లో యాంటీ ఆక్సిడెంట్ సమ్మేళనాలు సమృద్ధిగా ఉంటాయి. ఈ మొక్క ఉత్పన్న అణువులు ఆక్సీకరణ ఒత్తిడిని, వాపును తగ్గించడంలో సహాయపడతాయి. అంతే కాకుండా నైట్రిక్ ఆక్సైడ్ ఉత్పత్తిని కూడా మెరుగుపరిచే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. నైట్రిక్ ఆక్సైడ్ ఉత్పత్తి పెరగడం వల్ల రక్తనాళాలు బలంగా తయారవ్వడంతో పాటు ధమనుల గోడలు సడలి రక్తప్రసరణ మెరుగుపడుతుంది. ఈ జీవరసాయన చర్యల వల్ల గుండె సంబంధిత వ్యాధులు, కొవ్వు పేరుకుపోయే కాలేయ వ్యాధుల ప్రమాద కారకాలపై ప్రభావం చూపవచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

అయితే రక్తపోటు, చెడు కొలెస్ట్రాల్, మంచి కొలెస్ట్రాల్, రక్తనాళాల స్పందన వంటి వాటిల్లో మెరుగుదల కనిపించినప్పటికీ ఇవి ప్రధానంగా చిన్న స్థాయి నియంత్రిత అధ్యయనాలపై ఆధారపడి ఉన్నాయని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. డార్క్ చాక్లెట్ లో ఉండే ఫ్లేవనాల్స్ నైట్రిక్ ఆక్సైడ్ విడుదలను ప్రేరేపించి రక్తనాళాలను సడలింపజేస్తాయి. దీని ద్వారా రక్తపోటు తగ్గుతుంది. అలాగే డార్క్ చాక్లెట్ ను తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గి మంచి కొలెస్ట్రాల్ పెరిగి నట్టు కొన్ని పరిశోధనలు తెలియజేస్తున్నాయి. కోకోలో ఉండే ప్రతి ఆక్సీకరణ పదార్థాలు రక్తనాళాల గోడలను, కొవ్వు అణువులను ఆక్సీకరణ నష్టానికి గురికాకుండా రక్షిస్తాయి. దీంతో గుండె జబ్బులు వచ్చే అవకాశం తక్కువగా ఉంటుంది. గుండెకు అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుంది. గుండెపోటు, పక్షవాతం వచ్చే ప్రమాదాలు తగ్గుతాయి.

అలాగే డార్క్ చాక్లెట్ లో ఉండే ప్రతిఆక్సీకరణ పదార్థాలు కాలేయ ఆరోగ్యానికి మేలు చేస్తాయని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. డార్క్ చాక్లెట్ ను తీసుకోవడం వల్ల ఆక్సీకరణ ఒత్తిడి సూచికలు, కాలేయ ఎంజైమ్ స్థాయిలు తగ్గుతాయని వైద్యులు చెబుతున్నారు. కొవ్వు పేరుకుపోయే కాలేయ వ్యాధుల్లో కాలేయ కణాలను రక్షించడంలో కూడా ఈ చాక్లెట్ సహాయపడుతుంది. అయినప్పటికీ దీర్ఘకాలిక కాలేయ వ్యాధుల చికిత్సలో భాగంగా ఈ డార్క్ చాక్లెట్ ను వినియోగించవచ్చా లేదా అనే అంశాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

డార్క్ చాక్లెట్ గుండె , కాలేయ ఆరోగ్యానికి మేలు చేసేదే అయినప్పటికీ దీనిని మితంగానే తీసుకోవాలి. అన్ని రకాల చాక్లెట్లు ఒకేలా ఉండవు. అధిక కోకో శాతం ఉన్న చాక్లెట్ లలో ఫ్లేవనాల్స్ ఎక్కువగా, చక్కెర తక్కువగా ఉంటుంది. కొన్ని రకాల చాక్లెట్ లల్లో చక్కెర ఎక్కువగా ఉంటుంది. చక్కెర, క్యాలరీలు, కొవ్వు ఉండే చాక్లెట్ లను ఎక్కువగా తీసుకోవడం వల్ల మేలు కంటే హానే ఎక్కువగా కలుగుతుంది. కనుక వీటిని వైద్యుడి సలహా మేరకు మితంగా తీసుకోవడం చాలా ముఖ్యమని వైద్యులు సూచిస్తున్నారు.

# ఖమేనీ మృతితో అట్టుడుకుతున్న ఇరాన్.. మసీదుపై 'ప్రతీకార ఎర్రజెండా'



**ఇరాన్:** మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణించడంతో పరిస్థితి తీవ్రంగా మారింది. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన వైమానిక దాడిలోనే ఆయన మరణించినట్లు ఇరాన్ అధికారికంగా ప్రకటించింది. ఈ పరిణామంతో ఆగ్రహంతో రగిలిపోతున్న ఇరాన్, ప్రతీకారం తీర్చుకుంటామని ప్రతిన బూనుతూ క్వామ్ నగరంలోని పవిత్ర జామ్‌కరాన్ మసీదుపై 'ఎర్ర జెండా'ను ఎగురవేసింది. ఖమేనీ మరణంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్పందించారు. "చరిత్రలోనే అత్యంత క్రూరమైన వ్యక్తి అంతమయ్యాడు. ఇరాన్ ప్రజలు తమ దేశాన్ని తిరిగి చేజిక్కించుకోవడానికి ఇది గొప్ప అవకాశం" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. నెతన్యాహు కూడా ఖమేనీని ఒక నియంతగా అభివర్ణిస్తూ ఇరాన్ ప్రజలు తిరగబడాలని పిలుపునిచ్చారు. మరోవైపు, ఖమేనీ ఆకస్మిక మరణంతో దేశంలో రాజ్యాంగ సంక్షోభం తలెత్తకుండా ఇరాన్ ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టింది. కొత్త సుప్రీం లీడర్‌ను ఎన్నుకునేంత వరకు పాలనను పర్యవేక్షించేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన అత్యున్నత మండలిని ఏర్పాటు చేసింది. ఈ మండలిలో అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, చీఫ్ జస్టిస్ ఎజీ, క్లారిక్ సభ్యుడు అలీరెజా అరాఫీ ఉన్నారు.

షియా సంప్రదాయం ప్రకారం ఎర్ర జెండాను ఎగురవేయడం అంటే అన్యాయంగా చిందిన రక్తానికి ప్రతీకారం తీర్చుకుంటామని శపథం చేయడమే. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 40 రోజుల సంతాప దినాలు ప్రకటించడంతో పాటు సరిహద్దుల్లో ఉద్రిక్తతలు పతాక స్థాయికి చేరాయి.

# గంగవరం పోర్టు కేంద్రంగా సెజ్ ఏర్పాటు

## విదేశాలకు ఇనుప ఖనిజం సరఫరాకు సన్నాహాలు.. ఎన్ఎండిసి అగ్రిమెంట్‌పై సర్వత్రా చర్చ



**అమరావతి, పతాకం న్యూస్:** విశాఖలోని అదాని గంగవరం పోర్టు నుంచి ఇనుప ఖనిజాన్ని ఎగుమతి చేసేందుకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ (ఎన్ఎండిసి), బ్రెజిల్ దేశంలోని వేల్ సంస్థతో ఈ నెల 22న అదాని పోర్ట్స్ కంపెనీ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు గంగవరం పోర్టులో ఒక ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) ఏర్పాటు చేసి ఇక్కడ నుంచి కార్యకలాపాలు చేపట్టడానికి సన్నాహాలు చేస్తోంది. ఎన్ఎండిసి ఇనుప ఖనిజంతో కలిపి బ్రెజిల్ దేశం నుంచి దిగుమతి చేసుకునే ఐరన్‌ను ఈ సెజ్‌లో బ్లెండింగ్ చేసి విదేశాలకు ఎగుమతి చేస్తారు. ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ప్రస్తుతం గంగవరం పోర్టు ఎగుమతుల సామర్థ్యం 60-65 మిలియన్ టన్నులు కాగా కొత్తగా ఈ ఒప్పందంతో 75 మిలియన్ టన్నులకు పెరగనుంది. అదానితో విశాఖ పోర్టులోని అనుభవాన్ని పరిశీలిస్తే.. ఈక్యూ -- 1 బెర్త్‌ను 2011లో తీసుకుని 2017 వరకూ వ్యాపారం చేయకుండా పోర్టు కార్యకలాపాలకు ఆటంకం కలిగించి ఆర్థికంగా పోర్టును నష్టపరిచిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజా ఒప్పందంతో ఎన్ఎండిసికి తిప్పలు తప్పవా ? అన్న అనుమానాలు అందరిలోనూ కలుగుతున్నాయి.

ఎన్ఎండిసితో విశాఖ ఉక్కు కర్మాగారానికి ఐరన్ ఓర్ గనుల ఒప్పందాలున్నా సదరు సంస్థ అమలు చేయడం లేదు. ఐరన్ ఓర్‌ను ఎగుమతి చేసేదానికంటే స్థానికంగా ఉండే ఉక్కు కర్మాగారానికి ఇస్తే తక్కువ ధరకు ఆ ఇనుప ఖనిజాన్ని కొనుక్కునే అవకాశముంది. ఫలితంగా స్థానికంగా ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి. కార్పొరేట్ సంస్థ అయిన అదానితో ఎన్ఎండిసి ఒప్పందం వల్ల విశాఖ ఉక్కు కర్మాగారానికి మరింత నష్టం కలుగనుంది. గనులు లేకనే విశాఖ ఉక్కు నష్టాల పాలవుతున్న సంగతి అందరికీ తెలిసిందే. ఐరన్ ఓర్‌లో ప్రపంచంలోనే అత్యధికంగా 83 శాతం ఐరన్ కంటెంట్ ఉండే సంస్థ ఎన్ఎండిసి. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ వంటి దండకారణ్య ప్రాంతాల నుంచి కెకె లైన్ ద్వారా వచ్చే ఇనుప ఖనిజాన్ని ఎన్ఎండిసి తీసుకుంటుంది. బ్రెజిల్ దేశం ఐరన్ ఓర్‌లో ఐరన్ కంటెంట్ చాలా తక్కువ. అయితే తాజా ఒప్పందంతో బ్రెజిల్ నుంచి ఐరన్ ఓర్‌ను అదాని కంపెనీ తెచ్చుకుని, దాన్ని ఎన్ఎండిసి ఖనిజాలతో కలిపి రద్దు (వేస్ట్ మేటీరియల్)ను తొలగించనుంది. ఇలా ఇనుప ఖనిజంలో నాణ్యత రాబట్టడం కోసం జరిగే 'బ్లెండింగ్' ప్రక్రియలో విపరీతమైన కాలుష్యం వెలువడుతుందని నిపుణులు చెబుతున్నారు. మరోపక్క తన సొంత పోర్టులో సెజ్ పెట్టుకుని అదాని రాయితీలను సులభంగా పొందనున్నారు. ఈ లెక్కన కాలుష్యం ప్రజలకు, రాయితీలు అదానికి దక్కనున్నాయి. ఇదిలా ఉండగా విశాఖ నగరంపై కాలుష్య ప్రభావం లేకుండా శ్రీకాకుళం జిల్లా మూలపేట పోర్టుకు విశాఖ పోర్టు నుంచి బగ్గును తరలించాలని వైజాగ్ పోర్టే నిర్ణయించింది. ఇలాంటి స్థితిలో గంగవరం పోర్టులో ఏర్పాటు చేసే సెజ్‌లో ఐరన్ ఓర్ బ్లెండింగ్ పనితో గాజువాక పారిశ్రామిక ప్రాంతం కాలుష్యంతో మురికికూపంలా మారనుంది. అంతేగాక ఈ ప్రక్రియకు నీరు చాలా అవసరం. దీన్ని ఎక్కడ నుంచి తెస్తారన్నది ప్రశ్న.




# సంజూ శాంసన్ ఒంటరి పోరాటంతో సెమీఫైనల్‌కు దూసుకెళ్లిన భారత్



టీ20 వరల్డ్‌కప్‌లో భారత జట్టు సెమీఫైనల్లోకి అడుగుపెట్టింది. వెస్టిండీస్‌తో జరిగిన సూపర్-8 మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో నెగ్గింది. ఓపెనర్ సంజూ శాంసన్ (50 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్సర్లతో 97 నాటౌట్) చిరస్మరణీయ ఇన్నింగ్స్‌తో శతకం ముంగిట నిలిచాడు. ఇక ఈ విజయంతో గ్రూప్ 1లో రెండో స్థానంలో నిలిచిన భారత జట్టు సెమ?సలో ఇంగ్లండ్‌తో తలపడనుంది. గురువారం ఈ మ్యాచ్ జరుగనుంది. అటు విండీస్ ఈ ఓటమితో ఇంటిముఖం పట్టగా.. 2016 సెమీస్‌లో కరీబియన్ల చేతిలో ఎదురైన ఓటమికి భారత్ ప్రతీకారం తీర్చుకుంది. ముందుగా విండీస్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 195 పరుగులు చేసింది. చేజ్ (25 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 40), హోల్డర్ (22 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 37 నాటౌట్), పోవెల్ (19 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 34 నాటౌట్), హోప్ (33 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 32), హెట్‌మయెర్ (12 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సర్లతో 27) రాణించారు. బుమ్రాకు 2 వికెట్లు లభించాయి. ఛేదనలో భారత్ 19.2 ఓవర్లలో 5 వికెట్లకు 199 పరుగులు చేసి గెలిచింది. తిలక్ (27) ఫర్వాలేదనిపించాడు. హోల్డర్, జోసట?ఫలకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా సంజూ శాంసన్ నిలిచాడు.

ఛేదనలో ఓపెనర్ శాంసన్ ఆరంభం నుంచి ముగింపు వరకు అంతా తానై కదం తొక్కాడు. మరో ఎండ్‌లో పెద్దగా సహకారం లభించకపోయినా ఎలాంటి తడబాటుకు లోనుకాకుండా జట్టును సెమీస్‌కు చేర్చాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా నిలకడను ప్రదర్శిస్తూ చెలరేగాడు. ఇక జింబాబ్వేపై హాఫ్ సెంచరీతో ఫామ్ చాటుకున్న అభిషేక్ (10) మళ్లీ నిరాశపరిచాడు. ఇషాన్ (10) ఆట ఆరు బంతులకే పరిమితమైంది. వాస్తవానికి తొలి 10 బంతుల వరకు శాంసన్‌కు బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. కానీ మూడో ఓవర్‌లో మాత్రం 4,6,4తో తన ఉద్దేశాన్ని చాటుకున్నాడు. తన జోరుతో పవర్‌ప్లేలో స్కోరు 53/2తో మెరుగ్గా కనిపించింది. సూర్య (18) ఆచితూచి ఆడినా మరోవైపు శాంసన్ మాత్రం ధాటిని కొనసాగించాడు. షెఫర్డ్ ఓవర్‌లో 6,4తో ఆకట్టుకున్నాడు. అటు ఓసారి క్యాచ్ అవుట్ నుంచి తప్పించుకున్న సూర్యను 11వ ఓవర్‌లో జోసెఫ్ పెవిలియన్‌కు చేర్చాడు. దీంతో మూడో వికెట్‌కు 58 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత ఇన్నింగ్స్ కాస్త నెమ్మదించింది. అయితే 13వ ఓవర్‌లో తిలక్ హ్యాట్రిక్ ఫోర్లతో 17 రన్స్ సమకూరాయి. హెట్‌మయెర్ సూపర్ క్యాచ్‌తో తను పెవిలియన్‌కు చేరినా నాలుగో వికెట్‌కు 26 బంతుల్లోనే 42 పరుగులు వచ్చాయి. ఆ తర్వాత హార్దిక్ (17), దూబే (8 నాటౌట్) సహకరించారు. మరోవైపు శాంసన్ శతకం పూర్తి చేయకపోయినా 6,4తో మ్యాచ్‌కు అద్భుత ముగింపునిచ్చాడు.

# సూర్య ప్రశంసలకు సంజు భావోద్వేగం



టీ20 ప్రపంచకప్‌లో భాగంగా వెస్టిండీస్‌పై అద్భుత విజయం సాధించి సెమీఫైనల్‌కు అర్హత సాధించిన తర్వాత టీమిండియా డ్రెస్సింగ్‌రూమ్‌లో భావోద్వేగ వాతావరణం నెలకొంది. ఈ మ్యాచ్‌లో హీరోగా నిలిచిన సంజూ శాంసన్‌ను కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ప్రశంసలతో ముంచెత్తగా, సంజూ ఎమోషనల్ అయ్యాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను బీసీసీఐ విడుదల చేసింది. నిన్న జరిగిన ఈ కీలక మ్యాచ్‌లో భారత జట్టు 5 వికెట్ల తేడాతో వెస్టిండీస్‌ను ఓడించింది. లక్ష్య ఛేదనలో కేవలం 50 బంతుల్లో 97 పరుగులు చేసిన సంజూ శాంసన్, జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. మ్యాచ్ అనంతరం కెప్టెన్ సూర్యకుమార్, సంజూ ఆటతీరును ప్రత్యేకంగా అభినందించాడు. ఫామ్ కోల్పోయి జట్టులో స్థానం కోసం ఇబ్బంది పడిన తర్వాత ఇలాంటి ఇన్నింగ్స్‌తో తిరిగి రావడం గొప్ప విషయమని కొనియాడాడు. కెప్టెన్ మాటలకు భావోద్వేగానికి గురైన సంజూ.. సూర్యకుమార్‌ను ఆప్యాయంగా హత్తుకుని "రులాయేగా క్యా? (నన్ను ఏడిపిస్తావా ఏంటి?)" అని సరదాగా అనడంతో ఇద్దరూ నవ్వుకున్నారు. ఈ సందర్భంగా సూర్యకుమార్ మాట్లాడుతూ, సంజూ జట్టు పట్ల చూపిన నిబద్ధతను గుర్తుచేసుకున్నాడు. "మంచి వాళ్లకు ఎప్పుడూ మంచే జరుగుతుంది, అది కూడా సరైన సమయంలో జరుగుతుంది. జట్టుకు అవసరమైన సమయంలో సంజూ నిలబడ్డాడు. తను జట్టులోకి తిరిగి వచ్చినప్పుడు మాతో చెప్పిన మొదటి మాట.. 'మనకు ఏం కావాలో కాదు, జట్టుకు ఏం కావాలో అదే చేద్దాం' అని. ఇది అతని నిస్వార్థానికి నిదర్శనం" అని సూర్య వివరించాడు. "సంజూ జీవితంలో ఎన్నో ఒడిదొడుకులు చూశాడు. జట్టులో స్థానం కోల్పోవడం, వేరే బ్యాటింగ్ పొజిషన్‌లో ఆడటం వంటి సవాళ్లను ఎదుర్కొన్నాడు. అయినా పట్టుదలతో తిరిగి అదే స్థానంలో రాణించాడు.




# 6న 'సంప్రదాయని సుద్దిని సుద్దపూసని'



శ్రీ శివాజీ బ్యానర్‌పై శివాజీ, లయ జంటగా నటించిన సరికొత్త చిత్రం "సంప్రదాయని సుద్దిని సుద్దపూసని". ఈ నెల 6వ తేదీన ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో, చిత్ర యూనిట్ మీడియా సమావేశాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా హీరో శివాజీ, హీరోయిన్ లయ చిత్ర విశేషాలను పంచుకున్నారు. హీరో శివాజీ మాట్లాడుతూ.. ఇది ఒక విభిన్నమైన డార్క్ కామెడీ చిత్రమని తెలిపారు. "గతంలో లయ-నేను కలిసి చేసిన మూడు సినిమాలను ప్రేక్షకులు ఎలాగైతే ఆదరించారో, ఈ సినిమాను కూడా అలాగే ఆదరించాలని కోరుతున్నాను. సాంకేతిక పరంగా అత్యున్నత ప్రమాణాలు పాటించాం. ముఖ్యంగా సినిమా ఆఖరి 45 నిమిషాలు ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది. మాస్టర్ రోహన్ పాత్ర అద్భుతంగా నటించాడు" అని పేర్కొన్నారు. రాజకీయ, సామాజిక అంశాలపై స్పందిస్తూ.. "ఒక పక్క ప్రజల కోసం మాట్లాడుతూనే, మరోపక్క కుటుంబాల కోసం సినిమాలు చేస్తాను. అధికారంలో ఏ పార్టీ ఉన్నా ప్రజల శ్రేయస్సు కోసం నా గళం వినివినన్నానే ఉంటాను. విశాఖలో సినీ పరిశ్రమ అభివృద్ధి చెందాలి, లేదంటే ఇక్కడి వారు ఉపాధి కోసం మళ్లీ హైదరాబాద్, చెన్నై వెళ్లాల్సిన పరిస్థితి వస్తుంది" అని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో స్త్రీ వస్త్రధారణపై తాను చేసిన వ్యాఖ్యలు ఎవరినీ ఉద్దేశించినవి కావని, అవి తన వ్యక్తిగత భావనలు మాత్రమేనని ఆయన క్లారిటీ ఇచ్చారు. హీరోయిన్ లయ మాట్లాడుతూ.. విశాఖపట్నంతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. "నా తాతగారి స్వస్థలం విశాఖ కావడంతో చిన్నప్పుడు ఇక్కడే పెరిగాను. ఈ చిత్రంలో నా పాత్ర పేరు 'ఉత్తర'. భర్త మీద చూపించే అతి ప్రేమ ఎలాంటి ఇబ్బందులకు దారితీస్తుందనే అంశాన్ని కామెడీగా, వినోదాత్మకంగా తెరకెక్కించారు. ఇది కేవలం ఫ్యామిలీ సినిమా మాత్రమే కాదు, అన్ని వయసుల వారు చూసి ఎంజాయ్ చేసేలా ప్రమోట్ చేయాలని కోరుతున్నాను" అని తెలిపారు.

# 'ఉస్తాద్ భగత్ సింగ్' రీమేక్ కాదు: హరీశ్ శంకర్




పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా వస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంపై గత కొంతకాలంగా జరుగుతున్న ప్రచారానికి దర్శకుడు హరీశ్ శంకర్ ఫుల్‌స్టాప్ పెట్టారు. ఈ సినిమా తమిళ బ్లాక్‌బస్టర్ 'తెరి'కి రీమేక్ అంటూ వస్తున్న ఊహాగానాలపై ఆయన ఘాటుగా స్పందించారు. తన సినిమా రీమేక్ కాదని స్పష్టం చేయడమే కాకుండా అసలు 'తెరి' చిత్రంలోనే తన 'గబ్బర్ సింగ్' సినిమాలోని ఓ సన్నివేశాన్ని కాపీ చేశారని ఆరోపించారు.

తాజాగా ఓ ప్రమోషనల్ ఇంటర్వ్యూలో మాట్లాడిన హరీశ్ శంకర్, తాను రీమేక్ చేస్తే నిజాయతీగా ఒప్పుకుంటానని స్పష్టం చేశారు. "గబ్బర్ సింగ్ చిత్రానికి నేను 'మాటలు, మార్పులు, దర్శకత్వం' అని టైటిల్ కార్డ్ వేసుకున్నాను. బహుశా తెలుగు ఇండస్ట్రీలో అలా వేసుకున్న మొదటి వ్యక్తిని నేనే. ఆ టైటిల్ కార్డు చూసి రాజమౌళి గారు ఫోన్ చేసి మెచ్చుకున్నారు. అలాంటిది, 'ఉస్తాద్ భగత్ సింగ్' నిజంగా రీమేక్ అయితే 'కథ, మాటలు, దర్శకత్వం' అని ఎందుకు వేసుకుంటాను?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు. రీమేక్ ఆరోపణలను తిప్పికొడుతూ ఆయన ఓ ఆసక్తికరమైన విషయాన్ని బయటపెట్టారు. "గబ్బర్ సింగ్‌లో నేను పెట్టిన అంత్యాక్షరి ఎపిసోడ్‌ను స్ఫూర్తిగా తీసుకుని 'తెరి'లో రౌడీలతో రైమ్స్ చెప్పించారు. నా సినిమాలోని సీన్‌ను వాళ్లు వాడుకుంటే, ఇప్పుడు ఆ సినిమానే నేను రీమేక్ చేస్తున్నానని ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసం?" అంటూ హరీశ్ శంకర్ అసహనం వ్యక్తం చేశారు. ఏ పోలీస్ కథలో అయినా హీరో సంఘ విద్రోహ శక్తులపై పోరాడతాడని, 'తెరి', 'టెంపర్' వంటి సినిమాలన్నీ ఆ కోవకే చెందుతాయని అన్నారు.

పవన్ కల్యాణ్ కెరీర్‌లో 'గబ్బర్ సింగ్' ఇండస్ట్రీ హిట్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఆ సినిమా తర్వాత ఈ కాంబోలో వస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో పవన్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, పాటలకు అద్భుతమైన స్పందన రాగా, సినిమా ఈ నెల 26న విడుదలకు సిద్ధమవుతోంది.






# సొంతూరులో విజయ్, రష్మిక పూజలు..



టాలీవుడ్ క్రేజీ కపుల్ విజయ్ దేవరకొండ - రష్మిక మందన్నల రాకతో నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం తుమ్మెన్ పేట గ్రామం పులకించిపోతోంది. విజయ్ స్వగ్రామంలో ఈ నూతన దంపతులు డప్పు వాయిద్యాలు, మంగళ వాయిద్యాల నడుమ అత్యంత వైభవంగా తులసిమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెళ్లి తర్వాత ఆచారాల్లో భాగంగా వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య వీరు సత్యనారాయణ స్వామి వ్రత కార్యక్రమంలో ఆసీనుల య్యారు. ఈ వేడు కను కళ్లారా చూసేందుకు అచ్చంపేట నియోజక వర్గంలోని వివిధ రాజకీయ పార్టీల ముఖ్య నేతలతో పాటు గ్రామానికి చెందిన సుమారు 400 మంది అతిథులు హాజరయ్యారు. విజయ్-రష్మికల రాకతో తుమ్మెన్ పేటలో పండుగ వాతావరణం నెలకొంది. తమ అభిమాన నటులను చూడటానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

అయితే, ఈ స్టార్ కపుల్ భద్రత దృష్ట్యా వారి నివాసం వద్ద కట్టుదిట్టమైన ఆంక్షలు అమలు చేస్తున్నారు. కేవలం ముందస్తు పాసులు ఉన్న వారిని మాత్రమే ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది లోపలికి అనుమతిస్తున్నారు. అచ్చంపేట డీఎస్పీ పల్లె శ్రీనివాస్ నేతృత్వంలో సీఐ నాగరాజు, బల్మూరు ఎస్సై రాజేందర్ ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికార యంత్రాంగం పర్యవేక్షిస్తోంది. టాలీవుడ్ సెన్సేషనల్ జంట తమ సొంత ఊరిలో, అదీ సంప్రదాయబద్ధంగా వేడుకలు జరుపుకోవడం సోషల్ మీడియాలో సైతం హాట్ టాపిక్ గా మారింది.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**